ఆంధ్రజ్యోతి
ANDHRAJYOTHY

అన్నమయ్య
జిల్లా వార్తలు
5
ఆదివారం 12 జనవరి 2025



మదనపల్లెలో ఇసుకాసురులు

- నిషిద్ధ ప్రాంతంలోనూ తవ్వకాలు
- వేంపల్లె వాటర్ వర్క్స్ కేంద్రంలో..
- ఊటబావులనూ వదలని అక్రమార్కులు
- బావులను తలపిస్తున్న ఎస్ఎస్ ట్యాంకు

ఇసుక ఎంత తవ్వినా వారి ఆకలి తీరలేదు. ఇప్పటికే చెరువులు, కుంటలు, వాగులు, వంకల్లో తోడేయగా, తాజాగా భూగర్భ జలాలు వృద్ధి చేసే చెక్‌డ్యాంలు, ఊటబావులపై దృష్టి పెట్టారు. రాత్రిలో రహదారులు ఏర్పాటు చేసుకుని, పట్టపగలే పట్టణానికి తరలించి సొమ్ము చేసుకుంటున్నారు. ఉచిత ఇసుక విధానం ఇసుకాసురులకు కలిసొచ్చింది. దానికితోడు ఇసుక ఎక్కడా ఆశించిన స్థాయిలో లేకపోవడంతో నిషేధిత ప్రాంతాల్లో తవ్వకాలు మొదలు పెట్టారు. అడిగేవారు లేకపోవడంతో అక్రమార్కులు ఉన్న అవకాశాన్ని పూర్తి స్థాయిలో సద్వినియోగం చేసుకుంటున్నారు. దీంతో వినియోగదారుల నుంచి ట్రాక్టర్ లోడు రూ.5 వేలకు విక్రయించి, ప్రభుత్వానికి పైసా చెల్లించకుండా సొమ్ము చేసుకుంటున్నారు.





చిప్పిలి ఎస్ఎస్ ట్యాంకు సమీపంలో బావులను తలపిస్తున్న గోతులు

మదనపల్లె, జనవరి 11 (ఆంధ్రజ్యోతి): కర్ణాటక సరిహద్దు ప్రాంతమైన చీకలబైలు అటవీ ప్రాంతంలో మొదలయ్యే బాహుదానది మదనపల్లె గుండా ప్రవహిస్తూ నిమ్మనపల్లె బాహుదా ప్రాజెక్టుకు చేరుతుంది. సుమారు 38 కి.మీ. మేర అపారమైన ఇసుక లభ్యత ప్రాంతాలు ఉన్నాయి. ఇందులో భాగమైన చిప్పిలి సమ్మర్ స్టోరేజీ (ఎస్ఎస్) ట్యాంకును గర్భం వరకూ తోడేశారు. ఇప్పటికే ట్యాంకును మొత్తం బావులుగా మార్చేశారు. వర్షాకాలంలో మినహా పదేళ్లుగా ఈ ప్రాంతం ఇసుకాసురులకు కల్పతరువుగా మారిందనే చెప్పాలి. ఇప్పటి వరకు కోట్ల రూపాయల విలువ చేసే, లక్ష క్యూబిక్ మీటర్లకుపైగా ఇసుకను తవ్వేసినట్లు గనులు, భూగర్భ శాఖ, నీటి పారుదల శాఖాధికారులు అంచనా వేస్తున్నారు. అంతటితో ఆగలేదు. ఇసుక నుంచి తైలం తీస్తారన్న సామెతను గుర్తు చేసేలా మట్టి నుంచే ఇసుకను కూడా తయారు చేస్తున్నారు. తీసిన గుంతను వృథా మట్టితో పూడ్చేయడం, ఇసుక ఆనవాళ్లు ఉన్న మట్టిని బయటి నుంచి ఎస్ఎస్ ట్యాంకులోకి తరలించి ఆ మట్టిని ఇసుకగా తయారు చేస్తున్నారు. ఇందుకోసం సమీపంలోని బోరుబావుల నుంచి పైపులు ఏర్పాటు చేసి నీటిని నింపుతున్నారు. ఇది లా ఉండగా 38 కి.మీ ప్రవహించే బాహుదా వెంబడి పూర్తిగా తోడేయగా, ప్రస్తుతం రైతుల అభ్యంతరాలతో అక్కడక్కడా మిగిలిన ప్రాంతాల్లో తవ్వకాలు మొదలు పెట్టారు. అప్పటికీ అభ్యంతరం తెలిపిన చోట తృణమో, ఫణమో సమీపంలోని భూమి రైతులకు ఇచ్చి పట్టణానికి తరలిస్తున్నారు.

మదనపల్లె మున్సిపాలిటీకి ప్రధాన నీటి వనరుగా గుర్తింపు పొందిన వేంపల్లె వాటర్‌వర్క్స్‌నూ ఇసుకాసురులు వదలడం లేదు. పట్టణంలో సుమారు మూడు లక్షల మంది జనాభా ఉండగా, ఇందులో సగం మందికి పట్టణంలో సగం ఏరియాకు ఇక్కడి వాటర్ వర్క్స్ కేంద్రం నుంచే నీటి పంపింగ్ జరుగుతోంది. బాహుదా కాలువ వెంబడి ఊట బావులు తవ్వి వాటి చుట్టూ సర్కిల్ ఆకారంలో బావుల నిర్మాణం చేపట్టారు. వీటితో పాటు అక్కడక్కడా పరుగెత్తే నీటికి పగ్గాలు వేసేందుకు, నీటి ప్రవాహానికి ఇసుక కొట్టుకునిపోకుండా ఉండటానికి పెద్ద చెక్‌డ్యాంలు నిర్మించారు. అక్కడి నుంచి నీటిని పంపింగ్ చేసి సంపులకు నింపుతున్నారు. తర్వాత గ్రావిటీ ద్వారా పట్టణంలోని ఓవర్ హెడ్ ట్యాంకులకు, అక్కడి నుంచి కుళాయిల ద్వారా వీధులకు నీటిని పంపింగ్ చేస్తున్నారు. ఈ ఊట బావులతో పాటు సమీపంలోని బోర్లు వేసి 24 గంటలు నీటిని పంపింగ్ చేస్తున్నారు. ముఖ్యంగా ఊట బావులు నిర్మించిన బాహుదాలో కొన్నేళ్లుగా ఇసుక తవ్వకాలను నిషేధించారు. అంతటి ప్రాధాన్యం ఉన్న వేంపల్లె వాటర్ వర్క్స్ ఏరియాలోని బాహుదాలో రెండు రోజులుగా ఇసుకాసురులు తవ్వకాలు చేస్తున్నారు. వాటర్ వర్క్స్ కేంద్రంలో ఉన్న మున్సిపల్ సిబ్బందిని మచ్చిక చేసుకుని భారీగా ఇసుక తవ్వకాలు చేపడుతున్నారు. నిషిద్ధ ప్రాంతమైన చెక్‌డ్యాంలకు కింది వరకూ పది అడుగుల లోతు వరకు తవ్వకాలు చేస్తు న్నారు. ఇక్కడికి వెళ్లడానికి సమీపంలోని పొలం గుండా ప్రత్యేకంగా రహదారి ఏర్పాటు చేసుకుని, ట్రాక్టర్లతో తరలిస్తున్నారు. ఇదేమని ప్రశ్నిస్తే కాలువ ఆనుకుని మా భూమి ఉందని, అందుకే తవ్వకాలు చేపడుతున్నామని చెబుతున్నారు.

అటు చీకలబైలు, ఇటు నిమ్మనపల్లె వరకూ బాహుదా వెంబ డి స్థానికంగా ఉన్న వ్యాపారులే ఇసుకను తోడేస్తున్నారు. ఇందుకోసం ఎక్స్‌కవేటర్లు, టిప్పర్లు, ట్రాక్టర్లు కొనుగోలు చేసి వ్యాపారం చేస్తున్నారు. ముఖ్యంగా వేంపల్లె, పప్పిరెడ్డిపల్లె, చిప్పిలి, నక్కలదిన్నె, గుట్టకింద పల్లె, రామిరెడ్డిగారిపల్లె, బసినికొండ, తదితర ప్రాంతాల వారు ఉన్నారు. ఉచిత ఇసుక పాలసీ విధానంతో పోలీసు, రెవెన్యూ, భూగర్భ శాఖాఅధికారులు పెద్దగా పట్టించుకోకపోవడంతో ఇసుకాసురుల ఆగడాలు ఎక్కువయ్యాయి. మరోవైపు కొన్నిచోట్ల ట్రాక్టర్ లోడుపై పైన మట్టి కప్పుకుని, లోపల ఇసుక కూడా తరలిస్తున్నారు. వేంపల్లె వాటర్ వర్క్స్ కేంద్రం వద్ద జరుగుతున్న తవ్వకాలపై తహసీల్దార్ ఎస్.ఖాజాబీ, మున్సిపల్ కమిషనర్ కె.ప్రమీలకు ఫిర్యాదులు వెళ్లడంతో సిబ్బందిని పంపించి వేంపల్లె వాటర్ వర్క్స్ కేంద్రం వద్ద ఇసుక తరలింపును నిలిపేసినట్లు వారు తెలిపారు.







చిప్పిలి ఎస్ఎస్ ట్యాంకులోకి నీటి సరఫరాకు ఏర్పాటు చేసిన పైపు

కలెక్టరేట్ మీటింగ్ హాల్‌లో డీఆర్వో మధుసూదన్‌రావు, జిల్లా పోలీసు కార్యాలయంలో ఏఎస్పీ వెంకటాద్రి వడ్డే ఓబన్న చిత్రపటానికి నివాళులర్పిస్తున్న దృశ్యం



భావితరాలకు స్ఫూర్తి.. వడ్డే ఓబన్న పోరాటం

- నివాళులర్పించిన జిల్లా అధికారులు

రాయచోటి కలెక్టరేట్/టౌన్, జనవరి 11 (ఆంధ్రజ్యోతి): స్వాతంత్ర్య సమరయోధుడు వడ్డే ఓబన్న ఉద్యమ పోరాటం భావితరాలకు స్ఫూర్తిదాయకం అని జిల్లా రెవెన్యూ అధికారి మధుసూదన్‌రావు తెలిపారు. శనివారం కలెక్టరేట్‌లోని పీజీఆర్ఎస్ మీటింగ్ హాల్‌లో జిల్లా బీసీ సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో వడ్డే ఓబన్న జయంతి ఉత్సవాలను నిర్వహించారు. ముందుగా డీఆర్వో మధుసూదనరావు, బీసీ సంక్షేమ శాఖ జిల్లా అధికారి, వడ్డెర కుల సంఘం నాయకులు స్వాతంత్ర్య సమరయోధుడు వడ్డే ఓబన్న చిత్రపటానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. ఈ సందర్భంగా డీఆర్వో మాట్లాడుతూ స్వాతంత్ర్య సమరయోధుడు వడ్డే ఓబన్న జయంతి ఉత్సవాలను రాష్ట్ర ప్రభుత్వం అధికారంగా నిర్వహించడం ఎంతో సంతోషంగా ఉందన్నారు. వడ్డే ఓబన్న 11 జనవరి 1807న నంద్యాల జిల్లా సంజామల మండలంలో జన్మించారని, బ్రిటిష్ పాలనకు వ్యతిరేకంగా 1845 సంవత్సరంలో జరిగిన ఉద్యమంలో కీలకపాత్ర పోషించారన్నారు. ఉయ్యాలవాడ నరసింహారెడ్డి సైన్యానికి సైనాధ్యక్షుడిగా ఉండేవారన్నారు. ఇద్దరూ ఎంతో సన్నిహితంగా మెలిగేవారన్నారు. ఆయన జీవితాన్ని స్ఫూర్తిగా తీసుకుని యువత ఎన్నో విజయాలు సాధించాలని తెలిపారు. కార్యక్రమంలో వెనుకబడిన తరగతుల సంక్షేమ శాఖ జిల్లా అధికారి సురేశ్‌బాబు, వడ్డెర సంఘం నాయకులు, ఓపీడీఆర్ రాష్ట్ర సహాయ కార్యదర్శి టి.ఈశ్వరయ్య, ఏపీ విద్యావంతుల వేదిక రాష్ట్ర కన్వీనర్ జీవానందం, ఎంఆర్‌పీఎస్ నాయకులు రామాంజనేయులు, కలెక్టరేట్ సిబ్బంది పాల్గొన్నారు.

జిల్లా పోలీసు కార్యాలయంలో..

జిల్లా పోలీసు ప్రధాన కార్యాలయంలో వడ్డే ఓబన్న 218వ జయంతి వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఎస్పీ విద్యాసాగర్‌నాయుడు ఆదేశాల మేరకు జిల్లా అదనపు ఎస్పీ వెంకటాద్రి వడ్డే ఓబన్న చిత్రపటానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. ఈ సందర్భంగా అదనపు ఎస్పీ మాట్లాడుతూ వడ్డే ఓబన్న సామాన్యుల హక్కుల కోసం పోరాడిన గొప్ప వ్యక్తి అని కొనియాడారు. జయంతి వేడుకల్లో ఏఆర్ డీఎస్పీ ఎం.శ్రీనివాసులు, ఆర్ఐ ఎం.పెద్దయ్య, ఎస్‌బీ ఇన్‌స్పెక్టర్ రాజారెడ్డి, మహిళా పోలీస్‌స్టేషన్ ఇన్‌స్పెక్టర్ రవిశంకర్‌రెడ్డి, పోలీసు అధికారులు, పోలీసు సిబ్బంది పాల్గొన్నారు.

ఉపాధి హామీ పనుల్లో సిబ్బంది చేతివాటం

- ఫీల్డ్ అసిస్టెంట్లు, టెక్నికల్ అసిస్టెంట్ సస్పెన్షన్
- చనిపోయిన వారి పేరిట ఉపాధి బిల్లులు
- వలంటీర్లు, ఉద్యోగులూ కూలీలే
- రూ.20 లక్షలు తినేశారు..
- సిబ్బందిపై వేటు వేసిన డ్వామా పీడీ

6



ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదిక రద్దు

రాయచోటిటౌన్, జనవరి 11 (ఆంధ్రజ్యోతి): సంక్రాంతి పండుగ ఉత్సవాల్లో భాగంగా తొలి రోజు భోగి పండుగ సందర్భంగా ఈనెల 13వ తేదీ సెలవు కావడంతో జిల్లా పోలీసు కార్యాలయంలో జరగాల్సిన ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదిక కార్యక్రమాన్ని రద్దు చేస్తున్నట్లు ఎస్పీ విద్యాసాగర్‌నాయుడు శనివారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. అర్జీదారులు సుదూర ప్రాంతాల నుంచి వ్యయ, ప్రయాసలతో జిల్లా పోలీసు కార్యాలయానికి రావొద్దని ఆయన తెలియజేశారు.

సంక్రాంతికి ఇంటికి వస్తానంటివే..

- ఇంటికి రాకుండానే వెళ్లిపోతివా..
- గోడ కూలి హిటాచీపై పడి డ్రైవర్ మృతి
- సీటీఎం మిల్లు వద్ద ఘటన



రమేశ్‌రెడ్డి (ఫైల్)



హిటాచీలో చిక్కుకున్న మృతదేహం

మదనపల్లె అర్బన్, జనవరి 11 (ఆంధ్రజ్యోతి): రేపు ఇంటికి వస్తాను... అందరం కలిసి భోజనం చేద్దాం. సంక్రాంతి పండుగను ఘనంగా జరుపుకుందాం అని చెప్పి కానరాని లోకానికి వెళ్లిపోతివా... అంటూ మదనపల్లె జిల్లా ప్రభుత్వ ఆస్పత్రిలో మృతుడి భార్య తన చిన్న పిల్లలతో కలిసి రోదించడం చూసి అందరూ కంటతడిపెట్టారు. మండలంలోని సీటీఎం మిల్లు ప్రదేశంలో పాత గోడలను కూలుస్తూ శనివారం ఉదయం గోడకూలి హిటాచీపై పడటంతో రమేశ్‌రెడ్డి అక్కడికక్కడే మృతి చెందాడు. తాలుకా సీఐ కళా వెంకరటమరణ కథనం మేరకు మదనపల్లె మండలం సీటీఎం పంచాయతీలోని సీటీఎం మిల్లు ప్రదేశంలో నెల రోజులుగా హిటాచీలతో గోడలను తొలగించే పనులు చేస్తున్నారు. కడప జిల్లా వల్లూరు మండలం కుమారునిపల్లెకు చెందిన నారాయణరెడ్డి కుమారుడు ఎస్.రమేశ్‌రెడ్డి (40) సత్యసాయి జిల్లా కదిరిలో భార్య, ముగ్గురు పిల్లలతో కలిసి నివాసం ఉంటున్నాడు. అతను హిటాచీ డ్రైవర్‌గా పని చేస్తున్నాడు. మదనపల్లెకు ఈనెల 2వ తేదీ వచ్చాడు. హిటాచీతో గోడను తొలగిస్తూ ప్రమాదవశాత్తు గోడ కూలి హిటాచీపై పడటంతో అందులోనే ఇరుక్కుపోయి మృతి చెందాడు. అక్కడే ఉన్న మరో డ్రైవర్ మృతదేహాన్ని బయటకు తీసి మదనపల్లె జిల్లా ప్రభుత్వ ఆస్పత్రికి తరలించాడు. మృతుడికి 13, 11 ఏళ్ల వయసు కలిగిన కుమార్తెలు, నాలుగేళ్లున్న కుమారుడు ఉన్నారు. మృతుడి భార్య ప్రవీణ ఫిర్యాదు మేరకు తాలుకా సీఐ కళావెంకటరమణ కేసు నమోదు చేసినట్లు తెలిపారు. శవపరీక్షల అనంతరం మృతదేహాన్ని కదిరి తరలించినట్లు మృతుడి కుటుంబసభ్యులు తెలిపారు.

ఆంధ్ర-కర్ణాటక కొత్త రోడ్డు ఏర్పాటుకు చర్చలు

- కర్ణాటక ఎంపీ, ఎమ్మెల్యేలతో కలసి మదనపల్లె ఎమ్మెల్యే పరిశీలన

మదనపల్లె టౌన్, జనవరి 11 (ఆంధ్రజ్యోతి): మదనపల్లె-బెంగళూరు జాతీయ మార్గానికి సమాంతరంగా మదనపల్లె మండలం కోళ్లబైలు నుంచి కర్ణాటక రాష్ట్రం అమ్మ చెరువు వరకు రహదారి నిర్మాణానికి ముందడుగు పడింది. కర్ణాటక రాష్ట్రం శ్రీనివాసపురం తాలూకా రాయలపాడు నుంచి మదనపల్లె మండలం మిట్టామర్రిపల్లె వరకు షార్ట్‌కట్ మార్గం ఉంది. ఈ మార్గంలో రహదారి నిర్మిస్తే ఇరు రాష్ట్రాల ప్రజలకు ఎంతో ఉపయోగంగా ఉంటుందని మదనపల్లె ఎమ్మెల్యే షాజహాన్‌బాషా, కర్ణాటక రాష్ట్రం శ్రీనివాసపురం ఎమ్మెల్యే శివారెడ్డి, కోలార్ ఎంపీ మల్లేష్‌తో చర్చించారు. ఈ క్రమంలో శనివారం మిట్టామర్రిపల్లెకు చేరుకున్న కర్ణాటక ప్రజాప్రతినిధులతో కలసి ఎమ్మెల్యే అటవీ ప్రాంతంలో పర్యటించారు. ఈ సందర్భంగా షాజహాన్‌బాషా మాట్లాడుతూ ప్రస్తుతం బెంగళూరు రోడ్డులో వాహనాల రద్దీ ఎక్కువగా పెరిగిపోయిందని, ఈ రోడ్డుకు సమాంతరంగా ఇంకో రోడ్డు వేయడానికి సాధ్యాసాధ్యాలు పరిశీలిస్తున్నామన్నారు. దీనికోసం ఇరు రాష్ట్రాల అటవీ శాఖాధికారులు, ప్రజాప్రతినిధులతో చర్చించామన్నారు. దీనిపై సమగ్ర సర్వే నిర్వహించి నివేదికలు కోరామన్నారు. కార్యక్రమంలో టీడీపీ నాయకులు, అధికారులు పాల్గొన్నారు.



అటవీ సరిహద్దు వద్ద రోడ్డును పరిశీలిస్తున్న ఎమ్మెల్యే షాజహాన్ బాషా

అవనిపై హరివిల్లు

విజయవాడలో సందడిగా 'ఆంధ్రజ్యోతి-ఏబీఎన్' ముత్యాల ముగ్గుల పోటీల ఫైనల్స్





ఫైనల్స్‌లో ముగ్గులు వేస్తున్న పోటీదారులు (ఇన్‌సెట్‌లో) పోటీదారులతో కలిసి జ్యోతి వెలిగిస్తున్న కృష్ణాజిల్లాపరిషత్ మాజీ చైర్‌పర్సన్ గద్దె అనూరాధ

ప్రథమ బహుమతి గెలుచుకున్న తమిళనాడు మహిళ

కడప, తూర్పు, పశ్చిమ గోదావరి జిల్లాలకు ద్వితీయ బహుమతులు

11 మందికి కన్సొలేషన్ బహుమతులు

బహుమతులు ప్రదానం చేసిన హోంమంత్రి అనిత

ఆంధ్రజ్యోతి, ఏబీఎన్ నిర్వహిస్తున్న సంతూర్ ముత్యాల ముగ్గుల పోటీలు.. గార్డెనింగ్ పార్టనర్ క్రాఫ్టవారి పర్‌ఫెక్ట్, ఫ్యాషన్ పార్టనర్ డిగ్‌సెల్ వారి సెల్సియా (ట్రెండీ మహిళల ఇన్నర్‌వేర్) ఫైనల్స్ శనివారం ఘనంగా జరిగాయి. విజయవాడలోని నారా చంద్రబాబు నాయుడు కాలనీలోని బ్యాడ్మింటన్ కోర్టులో నిర్వహించిన ఈ పోటీల్లో రాష్ట్రంలోని 13 ఉమ్మడి జిల్లాలతో పాటు తమిళనాడు, కర్ణాటక విజేతలు కలిపి మొత్తం 15 మంది పాల్గొన్నారు. ప్రథమ బహుమతిని కె.భార్గవి (తమిళనాడు) సొంతం చేసుకోగా, మూడు ద్వితీయ బహుమతులను రమ్య (కడప), సావిత్రి (తూర్పు గోదావరి), వేణుభార్గవి (పశ్చిమ గోదావరి) సొంతం చేసుకున్నారు. మిగిలిన 11 మంది కన్సొలేషన్ బహుమతులు అందుకున్నారు. బహుమతుల ప్రదానోత్సవానికి హోంమంత్రి వంగలపూడి అనిత ముఖ్య అతిథిగా విచ్చేయగా, ఉమ్మడి కృష్ణా జిల్లాపరిషత్ మాజీ చైర్‌పర్సన్ గద్దె అనూరాధ జ్యోతి వెలిగించి ఫైనల్స్ పోటీలను ప్రారంభించారు. ఏపీ సెంట్రల్ డెస్క్ ఇన్‌చార్జి టి.సురేష్, న్యూస్ ఎడిటర్ కె.నాగసుధాకర్, విజయవాడ యూనిట్ మేనేజర్ వి.మురళీ తదితరులు పాల్గొన్నారు. న్యాయనిర్ణేతలుగా అబ్బూరి రత్నలక్ష్మి, సూరపనేని ఉషారాణి వ్యవహరించారు.

- ఆంధ్రజ్యోతి, విజయవాడ







ద్వితీయ బహుమతులు అందుకుంటున్న రమ్య (కడప), సావిత్రి (తూర్పు గోదావరి), వేణుభార్గవి (పశ్చిమ గోదావరి).. (కుడి నుంచి ఎడమకు), ముగ్గులు పరిశీలిస్తున్న మంత్రి అనిత



కన్సొలేషన్ బహుమతులు అందుకుంటున్న పి.జ్యోతి (శ్రీకాకుళం), ఎం.రాజు (విజయనగరం), నాగమల్లేశ్వరి (కృష్ణా), డి.ఉష (నెల్లూరు), కవిత (ప్రకాశం), ఏ.సునీత (గుంటూరు), జి.శ్రీలక్ష్మి (కర్నూలు), ఎస్.రమ్యకృష్ణ (అనంతపురం), రెడ్డిరాణి (చిత్తూరు), ఏ.సంతోషి (విశాఖపట్నం), రోహిణి (కర్ణాటక). చిత్రంలో ఏపీ సెంట్రల్ డెస్క్ ఇన్‌చార్జి టి.సురేష్, న్యూస్ ఎడిటర్ కె.నాగసుధాకర్, విజయవాడ యూనిట్ మేనేజర్ వేమూరి మురళీ, న్యాయనిర్ణేత అబ్బూరి రత్నలక్ష్మి



భావితరాలకు స్ఫూర్తి వడ్డే ఓబన్న

నివాళులర్పించిన మంత్రి మండిపల్లి రాంప్రసాద్‌రెడ్డి



వడ్డే ఓబన్న చిత్రపటానికి నివాళులర్పిస్తున్న మంత్రి మండిపల్లి రాంప్రసాద్‌రెడ్డి

రాయచోటిటౌన్, జనవరి 11 (ఆంధ్రజ్యోతి): స్వాతంత్ర్య సమరయోధుడు వడ్డే ఓబన్న త్యాగాలు భావితరాలకు స్ఫూర్తిదాయకమని మంత్రి మండిపల్లి రాంప్రసాద్‌రెడ్డి అన్నారు. వడ్డే ఓబన్న జయంతి సందర్భంగా శనివారం రాయచోటి పట్టణంలోని స్టేట్ గెస్ట్‌హౌస్‌లో వడ్డే ఓబన్న చిత్రపటానికి మంత్రి పూలమాల వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ వడ్డే ఓబన్న జయంతి ఉత్సవాలను ప్రభుత్వం అధికారికంగా నిర్వహించడం ఎంతో సంతోషంగా ఉందన్నారు. వడ్డే ఓబన్న స్వాతంత్ర్య సమరయోధుడు, యుద్ధ వీరుడు అని ఉయ్యాలవాడ నరసింహారెడ్డికి సర్వ సైనాధ్యక్షుడిగా ఉండి బ్రిటీషర్లపై పోరాడి ప్రాణ త్యాగం చేశారన్నారు. కార్యక్రమంలో పలువురు టీడీపీ నాయకులు, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

చౌకధరల దుకాణ డీలర్ పరీక్షల్లో 257 మంది అర్హులు

మదనపల్లె టౌన్, జనవరి 11 (ఆంధ్రజ్యోతి): మదనపల్లె రెవెన్యూ డివిజన్‌లో ఖాళీగా ఉన్న చౌకధరల దుకాణ డీలర్ల నియామకం కోసం నిర్వహించిన పరీక్షల్లో 257 మంది అర్హులైనట్లు సబ్‌కలెక్టర్ మేఘస్వరూప్ శనివారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. మదనపల్లె రెవెన్యూ డివిజన్‌లో ఖాళీగా ఉన్న చౌక ధరల దుకాణాల డీలర్ల నియామకం కోసం గత నెల 31వ తేదీ మదనపల్లెలో రాత పరీక్షలు నిర్వహించారు. 709 మంది దరఖాస్తు చేసుకోగా 369 మంది రాత పరీక్షలు రాశారు. ఈ క్రమంలో శనివారం విడుదల చేసిన ఫలితాల్లో 257 మంది అర్హులైనట్లు సబ్ కలెక్టర్ ప్రకటించారు. కాగా 15 దుకాణాలపై కొందరు హైకోర్టుకు వెళ్లి ఉత్తర్వులు తీసుకొచ్చారని, మిగిలిన దుకాణాలకు అర్హులైన వారికి ఇంటర్వ్యూలు నిర్వహిస్తామన్నారు. ఫలితాలను ఆయా మండలాల తహసీల్దార్ కార్యాలయాల నోటీసు బోర్డులో ఉంచుతామని తెలిపారు.

స్కానింగ్ యంత్రాలు స్వాధీనం



స్కానింగ్ పరికరాలను స్వాధీనం చేసుకుంటున్న దృశ్యం

పీలేరు, జనవరి 11 (ఆంధ్రజ్యోతి): పీలేరులోని నోబుల్ నర్సింగ్ హోంలో ఉన్న స్కానింగ్ యంత్రాలను శనివారం జిల్లా వైద్య శాఖాధికారులు స్వాధీనం చేసుకున్నారు. కలెక్టర్ చామకూరి శ్రీధర్ ఆదేశాల మేరకు వైద్య శాఖాధికారి డాక్టర్ కొండయ్య సూచనల మేరకు ఆ నర్సింగ్ హోంలోని యంత్రాలను జిల్లా ఇమ్యునైజేషన్ అధికారిణి డాక్టర్ ఉషశ్రీ పర్యవేక్షణలో అధికారులు స్వాధీనం చేసుకుని రాయచోటికి తరలించారు. లింగ నిర్ధారణ పరీక్షలు చేస్తున్నారన్న సమాచారంతో గత ఏడాది సెప్టెంబరు 13వ తేదీ జిల్లా అధికారులు నోబుల్ నర్సింగ్ హోంపై దాడులు నిర్వహించి ఆ ఆసుపత్రి వైద్యులు డాక్టర్ జి.బాషాను పట్టుకున్నారు. అప్పట్లో ఆసుపత్రిని, ఆసుపత్రిలోని స్కానింగ్ యంత్రాలను సీజ్ చేశారు. అయితే సీజ్ చేసిన యంత్రాలను అధికారుల స్వాధీనంలో ఉంచుకోవాలని ఇటీవల కలెక్టర్ ఆదేశించడంతో వైద్య శాఖాధికారులు వాటిని రాయచోటికి తరలించారు. యంత్రాల స్వాధీనంలో ఎటువంటి ఇబ్బందులు తలెత్తకుండా పీలేరు అర్బన్ సీఐ యుగంధర్ సహకరించారు. కార్యక్రమంలో వైద్య ఆరోగ్య శాఖ సిబ్బంది కుసుమ, ఉషారాణి, తదితరులు పాల్గొన్నారు.

ఉపాధి హామీ పనుల్లో సిబ్బంది చేతివాటం

- ఫీల్డ్ అసిస్టెంట్లు, టెక్నికల్ అసిస్టెంట్ సస్పెన్షన్
- చనిపోయిన వారి పేరిట ఉపాధి బిల్లులు
- వలంటీర్లు, ఉద్యోగులూ కూలీలే
- రూ.20 లక్షలు తినేశారు..
- సిబ్బందిపై వేటు వేసిన డ్వామా పీడీ



ఫీల్డ్, టెక్నికల్ అసిస్టెంట్లపై ఆగ్రహం వ్యక్తం చేస్తున్న పీడీ వెంకటరత్నం

గుర్రంకొండ, జనవరి 11 (ఆంధ్రజ్యోతి): ఉపాధి హామీ పనుల్లో చేతివాటం చూపిన సిబ్బందిపై డ్వామా పీడీ ఆగ్రహం వ్యక్తం చేసి ముగ్గురు ఫీల్డ్ అసిస్టెంట్లతో పాటు ఒక టెక్నికల్ అసిస్టెంట్‌ను సస్పెండ్ చేశారు. అంతేకాకుండా సిబ్బంది నుంచి రూ.39,452 రికవరీ చేశారు. వివరాలిలా ఉన్నాయి. ఏళ్ల క్రితం చనిపోయిన వ్యక్తులు కూడా ఉపాధి హామీ పథకంలో పనులు చేశారు. వారి ఆత్మలు వచ్చి డబ్బులు డ్రా చేసుకున్నాయి. ట్రాన్స్‌కో, మోడల్ పాఠశాలల్లో పనిచేసే ఉద్యోగులు కూడా రోజూ ఉపాధి పనులు చేయడం విశేషం. వైసీపీ ప్రభుత్వ హయాంలో వలంటీర్లగా ఉంటూనే ఉపాధి పథకంలో పనులు చేసి వేలాది రూపాయలను సొమ్ము చేసుకుని అవినీతికి పాల్పడిన సంఘటనలు సామాజిక తనిఖీ బహిరంగ సమావేశంలో వెలుగుచేశాయి.

గుర్రంకొండ మండలంలో ఉపాధి హామీ పథకంలో చేసిన వివిధ పనులను సామాజిక తనిఖీ బృందం వారం రోజులపాటు తనిఖీ చేసింది. ఇందులో భాగంగా మండలంలో రూ.7.77 కోట్లతో పనులు చేశారు. ఈ పనులను తనిఖీ బృందం పరిశీలించి వివరాలను అధికారులకు నివేదిక ఇచ్చారు. దీంతో డ్వామా పీడీ వెంకటరత్నం ఆధ్వర్యంలో శనివారం సామాజిక తనిఖీ బహిరంగ సభ నిర్వహించారు. ఈ సభలో ఆయన వివరాలను వెల్లడించారు. అమిలేపల్లె గ్రామానికి సుధాకర్ ట్రాన్స్‌కో శాఖలో కాంట్రాక్ట్ ఉద్యోగిగా పనిచేస్తూ ఉపాధి హామీ పథకంలో కూలీ పనులు చేసి సొమ్ము తీసుకున్నాడు. వనజ అనే మహిళ ఓ మండలంలోని మోడల్ పాఠశాలలో ఉద్యోగిగా ఉంటూనే గ్రామంలో ఉపాధి పనులు చేసినట్లు చూపి అవినీతికి పాల్పడినట్లు తనిఖీ బృందం నిర్ధారించింది. శెట్టివారిపల్లె పంచాయతీలో పి.రామచంద్ర అనే వ్యక్తి 2017వ సంవత్సరంలో చనిపోగా 2023వ సంవత్సరంలో ఉపాధి పనులు చేసినట్లు చూపారు. అలాగే అదే పంచాయితీకి చెందిన సి.వెంకటప్ప 2019లో చనిపోతే 2023లో ఉపాధి పనులు చేసినట్లు చూపి సొమ్ము డ్రా చేసినట్లు తనిఖీ బృందం వెల్లడించింది. అలాగే టి.రాచపల్లెకు చెందిన రాజశేఖర్, మర్రిపాడుకు చెందిన మరో నలుగురు, అమిలేపల్లెకు చెందిన ఇద్దరు వలంటీర్లు ఉపాధి పనులు చేసి అవినీతికి పాల్పడినట్లు బహిరంగ సభలో వెలుగుచూసింది. అమిలేపల్లె గ్రామంలో రాయునిచెరువులో అమృత్ సరోవర్ పథకంలో మినీ ట్యాంక్ పనులు చేయకుండానే రూ.3.85 లక్షలు, రాయునిచెరువు నుంచి దిగువచెరువుకు వెళ్లే వంక పనులు చేయకుండానే రూ.3 లక్షలు, రైతుల భూమిలో చేయాల్సిన ఫారంపాండ్‌ను ప్రభుత్వ భూమిలో చేయడంతో రూ.36 వేలు, రాయునిచెరువుకు వచ్చే మరో వంక పనులకు రూ.1.49 లక్షల పనుల్లో అవినీతికి జరిగినట్లు తనిఖీ బృందం గుర్తించింది.

అలాగే రైతుల భూముల్లో రోజా మొక్కల పెంపకం పనుల్లో భాగంగా అమిలేపల్లెకు చెందిన నలుగురు రైతుల పొలాల్లో 4 వేల రోజా మొక్కలు పెంచుతున్నారు. ఈ రోజా మొక్కల పెంపకం పనుల్లో సుమారు 3 వేలు మొక్కలు లేకుండానే వేలాది రూపాయలు బిల్లులు చేసినట్లు తనిఖీ బృందం నిర్ధారించింది. అలాగే పొలాల్లో చేసే రింగ్ ట్రెంచ్‌ల పనుల్లో రూ.39 వేల అవినీతిని గుర్తించారు. వివిధ గ్రామాల్లో మస్టర్లలో బినామీ పేర్లతో వేలాది రూపాయలను స్వాహా చేసినట్లు తెలిపారు. పనుల వద్ద ఏర్పాటు చేసే బోర్డులు లేకుండానే సొమ్ము చెల్లించినట్లు తనిఖీ బృందం నిర్ధారించింది. హౌసింగ్ పథకంలో పునాది పనులు చేయకుండానే బిల్లులు చేసినట్లు తెలిపారు. అలాగే మస్టర్‌లో కూలీల సంతకాలు కూడా ఒక్కరే చేసి నిధులు స్వాహా చేసినట్లు నిర్ధారించారు. రైతుల పొలాల్లో మొక్కల పెంపకం పనులకు సంబంధించి ఐదు గ్రామాలకు చెందిన రైతుల సొమ్మును ఎల్లుట్ల ఫీల్డ్ అసిస్టెంట్ ఖాతాకు రూ.1,02,188లను టెక్నికల్ అసిస్టెంట్ రవినాయక్ ట్రాన్స్‌ఫర్ చేసినట్లు తనిఖీ బృందం నిర్ధారించింది. ఉపాధి హామీ పథకంలో జరిగిన పనుల్లో రూ.20 లక్షల వరకు అవినీతి జరిగినట్లు తనిఖీ బృందం నిర్ధారించింది. కార్యక్రమంలో ఏపీడీ లక్ష్మీనరసింహా, ఎంపీడీవో వెంకటేశులు, ఏపీవో జయరామిరెడ్డి, ఎస్‌ఆర్పీ సుబ్బారావు, నాయకులు జగదీష్, ఎల్లుట్ల మురళీ, కార్యదర్శులు, సిబ్బంది పాల్గొన్నారు.

నలుగురి సస్పెన్షన్

ఉపాధి పనుల్లో అవినీతికి పాల్పడిన ముగ్గురు ఫీల్డ్ అసిస్టెంట్లు, ఒక టెక్నికల్ అసిస్టెంట్‌ను సస్పెండ్ చేసినట్లు డ్వామా పీడీ వెంకటరత్నం తెలిపారు. అమిలేపల్లె ఫీల్డ్ అసిస్టెంట్ లోకనాథ్‌ను శాశ్వతంగా తొలగించినట్లు తెలిపారు. అలాగే ఎల్లుట్ల ఫీల్డ్ అసిస్టెంట్ శంకరయ్య, శెట్టివారిపల్లె ఫీల్డ్ అసిస్టెంట్ సిద్రామన్‌లను తాత్కాలికంగా తొలగించినట్లు తెలిపారు. అలాగే టెక్నికల్ అసిస్టెంట్ రవినాయక్‌ను కూడా తాత్కాలింగా తొలగించినట్లు డ్వామా పీడీ తెలిపారు.

రూ.39,452 రికవరీ...

మండలంలోని జరిగిన ఉపాధి పథకం బహిరంగ సభలో రూ.39,452ను రికవరీ చేసినట్లు డ్వామా పీడీ తెలిపారు. ఇందులో భాగంగా ఏపీవో నుంచి రూ.3500, ఈసీ నుంచి రూ.8700, బీఎఫ్‌టీ నుంచి రూ.1500, టీఏ రవి నుంచి రూ.17,351, టీఏ మదన్ నుంచి రూ.1000, సీవో (కంప్యూటర్ ఆపరేటర్)లు రెడ్డెప్ప నుంచి రూ.5274, పుణ్యవతి నుంచి రూ.2127 మొత్తం రూ.39,452 నగదును రికవరీ చేసినట్లు తెలిపారు.

మంత్రి మండిపల్లి హామీతో సమ్మె విరమణ



కార్మిక సంఘాలతో చర్చిస్తున్న మంత్రి, ఎమ్మెల్యే, తదితరులు

ఓబులవారిపల్లె, జనవరి 11 (ఆంధ్రజ్యోతి) : ఏపీఎండీసీ కార్మిక సమస్యలను పరిష్కరిస్తామని మంత్రి మండిపల్లి రాంప్రసాద్‌రెడ్డి హామీ ఇవ్వడంతో కార్మికులు సమ్మె విరమించారు. ఏపీఎండీసీ కార్మికులు తొమ్మిది రోజులుగా వారి హక్కుల సాధన కోసం చేస్తున్న ఉద్యమాన్ని తెలుసుకొని మంత్రితో ఎమ్మెల్యే అరవ శ్రీధర్, టీడీపీ ఇన్‌చార్జి, కుడా చైర్మన్ ముక్కారూపానందరెడ్డితో కలిసి కార్మికులతో చర్చలు జరిపారు. మంగంపేట గ్రామ పెద్దలు ఈ చర్చల్లో ఉన్నారు. కార్మిక సంఘాలు ఇచ్చిన సమ్మె నోటీసులో ఉన్న ఐదు డిమాండ్ల పైన మంత్రి చర్చలు జరిపి ఈ సమస్యలన్నీ 25వ తేదీ లోపు విజయవాడలో గనుల శాఖ మంత్రితో పాటు ప్రిన్సిపల్ సెక్రటరీ, ఏపీఎండీసీ ఎండీతో మీటింగ్ ఏర్పాటు చేయించి సమస్యలు పరిష్కరిస్తామని హామీ ఇచ్చారు. సమావేశం ఏర్పాటు చేసేంతవరకు ఉద్యమాన్ని వాయిదా వేయాలని మంత్రి కోరగా సమ్మెను తాత్కాలికంగా 15 రోజులు వాయిదా వేస్తున్నట్లు కార్మిక సంఘాల నాయకులు తెలిపారు. కార్యక్రమంలో అన్ని ఏపీఎండీసీ కార్మిక సంఘాల నాయకులు, గ్రామ పెద్దలు పాల్గొన్నారు.

కూతుర్లపై అఘాయిత్యానికి పాల్పడిన తండ్రి అరెస్ట్

నిమ్మనపల్లి, జనవరి 11 (ఆంధ్రజ్యోతి): కన్న కూతుర్లపై అఘాయిత్యానికి పాల్పడిన తండ్రిని అరెస్ట్ చేసినట్లు డీఎస్పీ కొండయ్య తెలిపారు. శనివారం ఆయన మాట్లాడుతూ నిమ్మనపల్లి మండలంలోని ఓ గ్రామానికి చెందిన వ్యక్తి సొంత కూతుళ్లపై అఘాయిత్యానికి పాల్పడినట్లు తల్లి ఫిర్యాదు చేసిందన్నారు. గ్రామంలో విచారణ చేసి నిందితుతడిని అరెస్ట్ చేసినట్లు తెలిపారు. కార్యక్రమంలో సీఐ రమేష్‌బాబు, ఎస్‌ఐ తిప్పేస్వామి పాల్గొన్నారు.

తల్లి మందలించిందని కూతురు ఆత్మహత్య

రామసముద్రం, జనవరి 11 (ఆంధ్రజ్యోతి): తల్లి మందలించడంతో కూతురు మనస్థాపం చెంది ఆత్మహత్య చేసుకుంది. మృతురాలి తల్లి సుకన్య వివరాల మేరకు.. మండల కేంద్రానికి చెందిన సుకన్య కూతురు కణ్యేశ్వరి (15) కర్ణాటకలోని సోమయాజులపల్లెలో పదో తరగతి చదువుతోంది. శనివారం ఇంటి వద్ద కూతురు సెల్‌ఫోన్ చూస్తుండటంతో తల్లి మందలించింది. దీంతో మనస్థాపం చెందిన కణ్యేశ్వరి పురుగుల మందు తాగింది. మదనపల్లె ఆస్పత్రికి తరలిస్తుండగా మృతి చెందిందని తల్లి తెలిపింది.

లేగదూడల పెంపకంలో మెలకువలు పాటించాలి

- జిల్లా పశువైద్యాధికారి డాక్టర్ శారదమ్మ



విజేతలకు బహుమతులు అందిస్తున్న జిల్లా పశువైద్యాధికారి

చెన్నూరు, జనవరి 11 (ఆంధ్రజ్యోతి): రైతులు లేగదూడల పెంపకంలో తప్పనిసరిగా మెలకువలు పాటించాలని తద్వారా అవి ఆరోగ్యంగా పెరిగి యజమానికి ఆదాయ వనరుగా మారతాయని జిల్లా పశువైద్యాధికారి డాక్టర్ శారదమ్మ అన్నారు. నరసారెడ్డిపల్లెలో ఏపీ ఎల్‌డీఏ, కడప ఆర్థిక సౌజన్యంతో ఏర్పాటు చేసిన లేగదూడల పరిరక్షణలో జిల్లా పశువైద్యాధికారి లేగదూడల పెంపకంలో మెలకువలు, అవగాహన కల్పించారు. నేటి పరిస్థితుల్లో లేగదూడల పెంపకాన్ని శాస్త్రీయ పద్ధతుల ద్వారా పెంచాలన్నారు. వ్యాధినిరోధక టీకాలు ఎలాంటి సమయంలో ఇవ్వాలి, వ్యాధులు ఎలా గుర్తించాలి, గుర్తించకుంటే కలిగే నష్టాలు, వ్యాధులు రాకుండా చూసుకోవాల్సిన జాగ్రత్తలపై రైతులకు వివరించారు. కృత్రిమ గర్భధారణ ద్వారా మేలు జాతి రకం దూడలను ఉత్పత్తి చేసుకోవచ్చని తెలిపారు. ఈ విధానంపై ఆసక్తి చూపితే తక్కువ సమయంలోనే ఆరోగ్యవంతమైన లేగదూడలు పుట్టడం, వాటి ద్వారా ఆదాయం, అభివృద్ధిని సాధించవచ్చన్నారు. అనంతరం ప్రదర్శనకు వచ్చిన 42 లేగదూడలను పరిశీలించారు. వాటి యజమానులతో మాట్లాడారు. పశువైద్యాధికారుల సూచనలు పాటిస్తూ ఆరోగ్యంగా పెంచుకున్న లేగదూడలు రైతు కుటుంబానికి మంచి ఆదాయ వనరని తెలిపారు. ప్రదర్శనలో పాల్గొన్న ముగ్గురు రైతులకు ప్రథమ, ద్వితీయ, తృతీయ బహుమతులు అందించారు. వీటితో పాటు క్యాల్షియం మందులు, ఏలికపాము నివారణ మందులు ఉచితంగా అందించారు. కార్యక్రమంలో కడప ఏడీ శ్రీనివాసులరెడ్డి, ఏపీఎల్‌డీఏ వైద్యులు డాక్టర్ శివరామిరెడ్డి, శరత్, గొర్రెల విభాగం వైద్యాధికారి నవీన్‌రెడ్డి, స్థానిక వైద్యులు ఉపేంద్ర, ఎర్రపేరురెడ్డితో పాటు పశువైద్య సిబ్బంది కల్యాణ్, రజిత, రవి, జీవన్, పలువురు రైతులు పాల్గొన్నారు.

ప్రైవేట్ ట్రావెల్స్‌పై రవాణా అధికారుల దాడులు

పర్మిట్‌లు లేకుండా తిప్పుతున్న బస్సులు సీజ్

రూ. 5.49 లక్షల జరిమానా



ఇడమడక టోల్ గేట్‌వద్ద బస్సులను తనిఖీ చేస్తున్న రవాణా అధికారులు

ప్రొద్దుటూరు, జనవరి 11 (ఆంధ్రజ్యోతి): సంక్రాంతి పండుగవేళ అక్రమంగా తిప్పుతున్న ప్రైవేట్ ట్రావెల్స్‌పై ప్రొద్దుటూరు రవాణా అదికారులు దాడులు నిర్వహించారు. శనివారం తెల్లవారుజామున చాగలమర్రి టోల్ గేట్ వద్ద హైదరాబాదు నుంచి ప్రొద్దుటూరకు వస్తున్న బస్సులను ఆర్‌టీఓ మురళీ ఆధ్వర్యంలో బ్రేక్ ఇన్‌స్పెక్టర్లు ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ తనిఖీల్లో రెండు బస్సులకు పర్మిట్ లేకున్నా అక్రమంగా తిప్పుతున్నట్లు గుర్తించారు. ఈరెండు బస్సులకు రూ.5.24 లక్షలు జరిమానా విధించారు. నిబంధనలకు విరుద్ధంగా బస్సులో ప్రయాణీకులనే కాకుండా అక్రమంగా గూడ్స్ రవాణా చేస్తున్న మరో రెండు బస్సులను సీజ్ చేశారు. వీటికి పదివేలు వంతున రూ.20 వేలు జరిమానా విధించారు. మరో బస్సుకు ఎఫ్‌సి లేనందున రూ.5వేలు జరిమాన విధించినట్లు ఆర్‌టీఓ తెలిపారు.

ఈ డీఈఓ మాకొద్దు

స్కూల్ ఎడ్యుకేషన్ కమిషనర్‌కు సంఘాల వినతి

కడప ఎడ్యుకేషన్, జనవరి 11 (ఆంధ్రజ్యోతి): ఉపాధ్యాయులను తీవ్రంగా దుర్భాషలాడుతూ, మానసిక క్షోభకు గురిచేస్తున్న డీఈఓ మీనాక్షి మాకొద్దని వెంటనే చర్యలు తీసుకోవాలని ఉపాధ్యాయ సంఘాల ఐక్యవేదిక ప్రతినిధులు కమిషనర్ విజయరామరాజును కోరారు. శనివారం మంగళగిరి కమిషనరేట్‌లో కమిషనర్ విజయరామరాజు, మంగళగిరి టీడీపీ ఆఫీస్ ఇన్‌చార్జి కొనకల్ల నారాయణకు ఉపాధ్యాయ సంఘాల ఐక్యవేదిక ప్రతినిధులు వినతిపత్రాలు సమర్పించారు. ఉపాధ్యాయ సంఘాల ప్రతినిధులు లెక్కల జమాల్‌రెడ్డి, రామాంజనేయులు, అంకాల కొండయ్య, రమణారెడ్డి, పి.వి.సుబ్బారెడ్డి మాట్లాడుతూ డీఈఓగా బాధ్యతలు తీసుకున్న ఆమె పలు పాఠశాలల సందర్శించినపుడు ప్రధానోపాధ్యాయులు, ఉపాధ్యాయులను మానసిక క్షోభకు గురిచేస్తోందన్నారు. ఆవె ఏదో ఒక వంక చూపుతూ తిట్ల దండకం మొదలు పెడుతుందని చెప్పారు. ఇటువంటి డీఈఓ జిల్లాకు ఉండడం దురదృష్టకరమని ఉండకూడదన్నారు. జిల్లాలోని 27 సంఘాల ఉపాధ్యాయ సంఘాల నేతలంతా ఈ డీఈఓ మాకు వద్దని ఉద్యమ కార్యాచరణ ప్రకటించారన్నారు.



కమిషనర్‌కు వినతిపత్రం సమర్పిస్తున్న ఉపాధ్యాయ సంఘాల ఐక్యవేదిక ప్రతినిధులు

'పరిశ్రమల సహకారంతో ఉన్నత విద్యాభివృద్ధి'

కడప ఎడ్యుకేషన్, జనవరి 11 (ఆంధ్రజ్యోతి): ఉన్నత విద్యలో ప్రయోగాత్మక అభ్యసనం, ఒకే దేశం ఒకే పరీక్ష, నిరంతర సమగ్ర మూల్యాంకన పద్ధతుల, వినూత్న పద్ధతుల అమలుపై వైస్ చాన్సలర్ సమావేశంలో చర్చించినట్లు యోగివేమన విశ్వవిద్యాలయం ఉపకులపతి ఆచార్య కె.కృష్ణారెడ్డి వెల్లడించారు. తమిళనాడులోని వేలూర్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీలోని అన్నా ఆడిటోరియంలో అసోసియేషన్ ఆఫ్ ఇండియన్ యూనివర్సిటీస్ (ఏఐయూ) 10,11 తేదీల్లో పునరాలోచన అసెస్‌మెంట్ మూల్యాంకనంపై రెండు రోజుల సౌత్‌జోన్ వైస్ చాన్సెలర్ల సమావేశంలో వైవీయూ వీసీ ఉన్నత విద్యపై ప్రసగించారు. స్టార్టప్‌లు, పెట్టుబడిదారులు, ఇంక్యుబేటర్‌లతో సహకారాన్ని అన్వేషించడం ద్వారా ఆవిష్కరణలను పెంపొందించడంలో విశ్వవిద్యాలయం నిబద్ధతతో ఉందన్నారు. విద్యా సంస్థలు పరిశ్రమలతో అనుసంధానమై పని చేసే నైపుణ్యత గల విద్యార్థులు సమాజంలో వస్తారని ఆ దిశగా ప్రయత్నాలు జరగాలన్నారు. ఈ చర్చల్లో వైవీయూ ప్రొఫెసర్ కె.కృష్ణారెడ్డి, ఏపీ నుంచి ప్రొఫెసర్ పి.పాపారావు (ఎస్‌వీ తిరుపతి), ప్రొఫెసర్ ఎన్‌టీకే నాయక్ (రాయలసీమ యూనివర్సిటీ) చర్చల్లో పాల్గొని భారతదేశ ఉన్నత విద్యపై సమ్మిళిత వృద్ధికి విలువైన సూచనలను అందించారు.

సాయి ఏజెన్సీని రద్దు చేయాలి


మున్సిపల్ యూనియన్ జిల్లా గౌరవాధ్యక్షుడు మనోహర్

కడప నాగరాజుపేట, జనవరి 11 (ఆంధ్రజ్యోతి): జిల్లా వ్యాప్తంగా క్లాప్ వాహనాలు ప్రొద్దుటూరు, జమ్మలమడుగు, కడపలో నడుస్తున్నాయని, కార్మికులకు రూ.18వేలు ఇవ్వాల్సి ఉండగా దాదాపు రూ.10500 మాత్రమే ఇస్తున్న సాయి పావని ఏజెన్సీని రద్దు చేయాలని మున్సిపల్ యూనియన్ జిల్లా గౌరవాధ్యక్షుడు మనోహర్, సీఐటీయూ నగర అధ్యక్ష, కార్యదర్శులు వెంకటసుబ్బయ్య, చంద్రారెడ్డి డిమాండ్ చేశారు. విశాఖలో రూ.18వేలు ఇస్తున్నారన్నారు. కడపలో రూ.13వేలు అని చెప్పి రూ.10500 మించి ఇవ్వడం లేదన్నారు. రెడ్డి ఏజెన్సీ మీద, పావని ఏజెన్సీ మీద లేబర్ డిపార్ట్‌మెంట్‌లో చర్చలు నడుస్తున్నాయని గుర్తుచేశారు. అయినా సాయి పావని యాజమాన్యం స్పందించకపోవడం అన్యాయమని తెలిపారు. ఇప్పటికైనా తక్కువ వేతనాలు ఇస్తున్న సాయి పావని ఏజెన్సీని రద్దు చేసి కార్పొరేషన్, మున్సిపాలిటీలు నిర్వహించాలన్నారు. జీఓ 7 ప్రకారం రూ.24500 వేతనం ఇవ్వాలని డిమాండ్ చేశారు. ప్రజల ద్వారా వసూలు చేస్తున్న డబ్బు ఒక్కో వాహనానికి దాదాపు రూ.63000 ఇస్తున్నారని, డీజల్, డ్రైవర్ ఇతరుల పేరు మీద రూ.30 నుంచి రూ.40వేలు మాత్రం కూడా ఖర్చుపెట్టలేదన్నారు. పీఎఫ్, ఈఎస్ఐ సక్రమంగా కట్టలేదని ఆరోపించారు. వీటిపై విచారణ చేసి పావని ఏజెన్సీపై, రెడ్డి ఏజెన్సీపై చర్యలు తీసుకోవాలని ఒక సంయుక్త ప్రకటనలో డిమాండ్ చేశారు.

అడ్డంకుల నడుమ ఆరు లేన్లు

20 కి.మీ రోడ్డు పనులకు నాలుగున్నర కి.మీ అభ్యంతరాలు

● క్లియరెన్స్ అయ్యేనా...? ● పనులు పూర్తయ్యేదెప్పుడు



ఆరు లేన్ల రహదారికి జరుగుతున్న కారిడార్ నిర్మాణం

పోరుమామిళ్ల, జనవరి 11 (ఆంధ్రజ్యోతి): పట్టణాల నుంచి రాజధాని నగరాలకు వెళ్లాలన్నా, మెగా నగరాలకు వెళ్లాలన్నా ప్రయాణీకుల దూరాన్ని తగ్గిస్తూ ప్రయాణీకుల మెరుగైన సౌకర్యం కల్పించడమే కేంద్ర ప్రభుత్వం లక్ష్యం. ఇందులో భాగంగా విజయవాడ మీదుగా కడప, బెంగళూరుకు వెళ్లే గ్రీన్‌ఫీల్డ్ నిర్మాణం ఆరు లేన్ల రహదారికి పనులు 20 కిలో మీటర్ల మేర పనులు జరిగితే నాలుగున్నర కిలో మీటర్ల మేరకు అభ్యంతరాలు వ్యక్తం మవుతున్నాయి. ఆరులేన్ల రహదారికి నిధులు కేటాయించింది. వివరాల్లోకెళితే...

విజయవాడ నుంచి బెంగళూరు వెళ్లేవారికి. బెంగళూరు నుంచి విజయవాడ వెళ్లేవారికి తక్కువ దూరం పట్టేందుకు వీలుగా నిర్మాణాలకు శ్రీకారం చుట్టింది. మల్లేపల్లె నుంచి కవలకుంట్ల రెవెన్యూ పొలాల వరకు దాదాపు 20 కి.మీ పొడవునా ఆరు లేన్ల రహదారికి రూ.622 కోట్లు నిధులు కేటాయించింది. మల్లేపల్లె నుంచి చెన్నారెడ్డిపేట వరకు అర్త్ పనులు ప్రారంభమయ్యాయి. 20 బ్రిడ్జిలు అండర్‌ప్రాసెస్‌లో ఉన్నాయి. సిద్దవరం వద్ద దాదాపు 5 కి.మీ అర్త్ వర్క్ జరుగుతోంది. అటవీశాఖకు సంబంధించి ఇంకా కిలోమీటరు క్లియరెన్స్ కావాల్సి ఉండగా ఈ పనులు దక్కించుకున్న మెగా ఇంజనీరింగ్ కన్స్‌స్ట్రక్షన్స్ వారు అనుమతి కోసం ప్రభుత్వానికి నివేదిక కోరింది. మూడున్నర కిలోమీటరు రైతులకు సంబంధించి నష్టపరిహారం కొందరికి అందకపోవడం వల్ల ఆ పనులు కూడా కొద్దిగా జాప్యం జరిగే అవకాశాలున్నాయి. ప్రస్తుతం 15శాతం పనులు జరిగాయి. కొన్నిచోట్ల టన్నెల్ పనులు జరుగుతున్నాయి. దాదాపు ఆరులేన్ల రహదారికి సంబంధించి 8గ్రామాలకు 162 ఎకరాల పొలాలు రహదారికి అవసరం అవుతాయి. వీటి కోసం రహదారి నిర్మాణంలో భూములు కోల్పోయే వారి కోసం ప్రభుత్వం రూ.21 కోట్లు నిదులు మంజూరు చేసింది. ఇందులో దాదాపు 247 మంది రైతులకు రూ.13 కోట్ల వరకు పంపిణీ జరిగినట్లు సమాచారం. ఇంకా 68 ఎకరాలకు సంబంధించి 56 మంది రైతులకు పరిహారం అందాల్సి ఉంది. అయితే రెవెన్యూ అధికారులు పూర్తి స్థాయిలో రికార్డులు పరిశీలించి భూములు కోల్పోయిన వారందరికీ పరిహారం అందిస్తామని చెబుతున్నారు. ఇటీవల జేసీ కూడా భూములు పరిశీలించి పనులకు అభ్యంతరాలు తెలపవద్దని, అర్హులందరికీ నష్టపరిహారం దక్కేలా చేస్తామని హామీ ఇచ్చారు. ఇందుకు సంబంధించి గతంలో రెవెన్యూ అధికారులు రైతులతో సమావేశం ఏర్పాటు చేసి భూములు కోల్పోయే వారి విస్తీర్ణం, రికార్డులను అప్పజెబితే వారందరికీ పరిహారం అందిస్తామని చెబుతున్నారు. ఈ నేపథ్యంలో ఈ ఆరులేన్ల రహదారికి అడ్డంకులన్నీ పూర్తి చేసుకుని నిర్మాణం వేగవంతమైతే పూర్తయ్యే సమయానికి ఎంత సమయం పడుతుందోనని ఈ ప్రాంతీయులు ఎదురు చూస్తున్నారు. కొన్ని చోట్ల గ్రావెల్‌కు మైనింగ్ అధికారుల అనుమతులు కూడా అందాల్సి ఉందని తెలిసింది. ఈ అడ్డంకులన్నీ తొలగి పనులు ఎప్పుడు వేగవంతమవుతాయో, ఎప్పుడు పూర్తవుతాయోనని ప్రజలు ఎదురు చూస్తున్నారు. కొందరు రైతులు అయితే నష్టపరిహారం కోసం ఎదురు చూస్తున్నారు.



ఆరు లేన్ల రహదారికి నీళ్లు తడుపుతున్న దృశ్యం



రోలరుతో చదును చేస్తున్న దృశ్యం

రూ. కోటి స్థలంలో ఆగని అక్రమాలు

ఖద్దరు అండతో సాగుతున్న నిర్మాణాలు ● పోలీసులు హెచ్చరికలు చేసినా ప్రయోజనం శూన్యం

పట్టించుకోని నేషనల్ హైవే అథారిటీ అధికారులు

రైల్వేకోడూరు, జనవరి 11 (ఆంధ్రజ్యోతి): కబ్జా స్థలంలో అక్రమ కట్టడాలు సాగుతున్నాయి. ఖద్దరు అండతో నిర్మాణాలు జోరందుకున్నాయి. పోలీసుల హెచ్చరికలు సైతం పట్టించుకోకుండా నిర్మాణాలు చేస్తున్నారు. నేషనల్ హైవే అథారిటీ స్థలంలో అక్రమ కట్టడాలు జరుగుతున్నా పట్టించుకోకుండా నిమ్మకు నీరెత్తినట్లు వ్యవహరిస్తున్నారు. వివరాల్లోకి వెళితే....

రైల్వేకోడూరు పట్టణం లక్ష్మీపార్యడైజ్ సినిమా హాలు వద్ద ప్రధానదారి పక్కనే ఉన్న నేషనల్ హైవే అథారిటీ స్థలాన్ని ఆక్రమించి భారీ ఎత్తున అక్రమ కట్టడాలు సాగుతున్నాయి. మొత్తం 20 అడుగుల స్థలాన్ని ఆక్రమించారని స్థానికులు చెబుతున్నారు. ప్రస్తుత ధర ప్రకారం ఆక్రమిత స్థలం రూ. కోటి విలువ చేస్తుందని అంచనా. ఖద్దరు బాబుల అండతో ఆక్రమణలు జోరుగా సాగుతున్నాయి. రైల్వేకోడూరు మెయిన్ రోడ్డులో స్థలం చాలా విలువైన స్థలం కావడంతో ప్రధాన దారికి ఇరువైపులా ఉన్న భవనాల్లో అద్దె భారీ ఎత్తున ఉంటాయి. ఇతర ప్రాంతీయులు రైల్వేకోడూరులో స్థిరపడి కొంత స్థలాన్ని కొనుగోలు చేస్తుంటారు. స్థలానికి ముందు భాగంలో ఉన్న ప్రభుత్వ స్థలాలను ఆక్రమించుకుని భవన నిర్మాణాలు చేస్తుంటారు. ఇది రైల్వేకోడూరులో పరిపాటిగా మారింది. ప్రభుత్వ స్థలం కనిపిస్తే చాలు అట్లే వాలిపోయి ఆక్రమించి భవనాలు నిర్మాణాలు సాగిస్తారు. ఇది కేవలం ఖద్దరు బాబుల అండతోనే సాగుతోంది. ఎక్కడా లేని విధంగా రైల్వేకోడూరులో ఈ తంతు సాగుతోందని స్థానికులు చెబుతున్నారు. చికెన్ దుకాణానికే ఇంత పెద్దగా నిర్మాణం చేస్తున్నారంటే షాపింగ్‌కు అయితే ఇంకెంత పెద్ద భవనం కడతారా అని స్థానికులు ఆశ్చర్యం వ్యక్తం చేస్తున్నారు. రైల్వేకోడూరు ప్రధానదారిలో ఎక్కడ చూసినా ఆక్రమణలే కనిపిస్తున్నాయి. డాక్యుమెంట్‌లో ఎక్కడా నిర్మాణాలు సా గడం లేదు. డాక్యుమెంట్‌లో 60 అడు గుల పొడవు, 20 అడుగుల వెడల్పు ఉంటే పొడవులో 100 అడుగులు, వెడ ల్పులో 30 అడుగులు కలిపి అక్రమ నిర్మాణాలు చేస్తున్నారు. ఈ తతంగం తెలిసినా నేషన్ హైవే అథారిటీ అధికారు లు పట్టించుకోకుండా ఉన్నారని ప్రజలు ఆరోపిస్తున్నారు. ఇప్పటికైనా ఆక్రమణలు జరిగిన ప్రాంతాలను పరిశీలించి, సర్వే చేయించి చర్యలు తీసుకోవాలని స్థానికులు డిమాండ్ చేస్తున్నారు.



ప్రభుత్వ స్థలంలో సాగుతున్న పనులు

నేషనల్ అథారిటీ అధికారి ఏమంటున్నారంటే

లక్ష్మీప్యారడైజ్ సినిమా హాలు స్థలంలో ఆక్రమణలు జరుగుతున్నాయని తమ దృష్టికి వచ్చిందని జిల్లా నేషనల్ అథారిటీ అధికారి నారాయణ నాయక్ తెలిపారు. పోలీసులకు ఫిర్యాదు చేశామని, సర్వే చేయమని తహసీల్దార్‌ను కోరామన్నారు. ఆక్రమణలపై చర్యలు తీసుకుంటామని ఆయన వివరించారు.

చికిత్స పొందుతూ వృద్ధుడు మృతి

పోరుమామిళ్ల, జనవరి 11 (ఆంధ్రజ్యోతి): తీవ్ర మనోవేదనకు గురైన తమ్మిశెట్టి పెద్దవెంకటేశ్ (70) విష రసాయనం తాగి ఆస్పత్రిలో చికిత్స పొందుతూ మృతి చెందినట్లు ఏఎస్‌ఐ మూర్తి తెలిపారు. ఆయన పాత్రికేయులకు తెలిపిన వివరాలిలా... సిద్దనకిచ్చాయపల్లెకు చెందిన తమ్మిశెట్టి పెద్దవెంకటేశ్ భార్య చనిపోయినప్పటి నుంచి మనోవేదనకు గురయ్యాడని, శుక్రవారం ఉదయం విష రసాయనం తాగడంతో అతని కుమారుడు, బంధువులు స్థానిక ప్రభుత్వ ఆస్పత్రికి తీసుకెళ్లగా, మెరుగైన వైద్యం కోసం కడప రిమ్స్‌కు తరలించారు. అక్కడ చికిత్స పొందుతూ శుక్రవారం సాయంత్రం చనిపోయాడు. శనివారం కుమారుడు చలపతి ఫిర్యాదుపై కేసు నమోదు చేసినట్లు ఏఎస్‌ఐ తెలిపారు.

దాతలకు సన్మానం

బ్రహ్మంగారిమఠం, జనవరి 11 (ఆంధ్రజ్యోతి): కనుమ పోలేరమ్మ అమ్మవారి ఆలయానికి రేకులషెడ్డు అమర్చిన దాతలను దేవస్థానం ఫిట్‌పర్సన్ శంకరబాలాజీ సన్మానించారు. సుమారు రూ.5లక్షలతో బళ్లారి వాస్తవ్యులు చేపట్టారని ఈ సందర్భంగా దేవస్థానం ఫిట్‌పర్సన్ శంకరబాలాజీ దాతలను ఘనంగా సన్మానించి తీర్థ ప్రసాదాలు అందించినట్లు తెలిపారు. బళ్లారి వాస్తవ్యులు భీమినేని రంగయ్య, భీమినేని విష్ణువర్ధన్, భీమినేని ప్రసాద్, భీమినేని భాస్కర్‌నాయుడు, సోంపల్లె రమేశ్, మోదుపల్లి సుబ్బరాయుడు, ప్రజలు పాల్గొన్నారు.

లక్ష్మీనరసింహస్వామికి పంచలోహ కవచం

బద్వేలు రూరల్, జనవరి 11 (ఆంధ్రజ్యోతి): వల్లెలవారిపల్లెలో వెలసిన లక్ష్మీ నరసింహస్వామి వారికి పంచలోహ కవచం (తొడుగు)ను బహూకరించారు. శనివారం అదే గ్రామానికి చెందిన దివంగతులు నల్లం బాలక్రిష్ణ(ఆర్మీ) సతీమణి అర్చన రూ.1.30లక్షలు విలువైన కవచం వేదపండితుల ఆధ్వర్యంలో స్వామివారికి కవచ సంప్రోక్షణ నిర్వహించి అలంకరించారు. అనంతరం మధ్యాహ్నం అన్నదానం నిర్వహించారు. భక్తులు స్వామివారిని దర్శించుకున్నారు.



పంచలోహ కవచాన్ని సమర్పిస్తున్న దాతలు

అన్నదానానికి రూ.50వేలు విరాళం



నిత్యాన్నదాన పథకానికి విరాళం అందిస్తున్న దాతలు

చక్రాయపేట, జనవరి 11 (ఆంధ్రజ్యోతి): గండి క్షేత్రంలో నిర్వహించే శాశ్వత నిత్యాన్నదాన పథకానికి కడపకు చెందిన పవన్‌కల్యాణ్ తల్లిదండ్రులు కె.ఆనంద బాబు, వనిత, కుటుంబ సభ్యులు రూ.50వేలు చెక్కు రూపంలో విరాళం అందించారు. వీరిక ప్రత్యేక దర్శనం చేయించి తీర్థప్రసాదాలు అందించారు. ఆలయ సహాయ కమిషనర్ కె.వెంకటసుబ్బయ్య, మాజీ పాలక మండలి చైర్మన్ కల్లూరు వెంకటస్వామి, ప్రధాన అర్చకులు కేసరి తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా తైలాభిషేకం మహోత్సవం

కడప కల్చరల్, జనవరి 11 (ఆంధ్రజ్యోతి): శనిత్రయోదశి సందర్భంగా శనివారం స్థానిక రామక్రిష్ణ నగర్‌లో వెలసిన శ్రీసాయి శనీశ్వర స్వామి దేవస్థానంలో స్వామివారికి తైలాభిషేకం నిర్వహించారు. ఆలయ ప్రధా న అర్చకులు వారణాసి శ్రీధర శర్మ ఆధ్వర్యంలో స్వామివారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. స్వామి దర్శనానికి పెద్దఎత్తున భక్తులు స్వామివారి సేవలో తరించారు.

విలేకరి పేరుతో బలవంతపు వసూళ్లు

దువ్వూరు, జనవరి 11 (ఆంధ్రజ్యోతి): ఇడమడక వద్ద విలేకరినని చెప్పుకుంటూ ఇండ్ల కుమార్‌రాజా ఇసుక ట్రాక్టర్ల వద్ద బలవంతపు వసూళ్లకు పాల్పడ్డాడని ఎస్‌ఐ వినోద్‌కుమార్ తెలిపారు. రాత్రివేళ దోచుకుంటున్న విషయం పోలీసులకు సమాచారం అందడంతో అతన్ని అరెస్టు చేశామన్నారు. ప్రతి ట్రాక్టర్ నుంచి రూ.5 వేలు వసూళ్లకు పాల్పడ్డాడని డబ్బు ఇవ్వకపోతే పిడిబాకుతో బెదిరింపులకు సైతం పూనుకున్నట్లు చెప్పారు. వ్యక్తి ట్రాక్టర్ యజమానులను ఇలా బెదిరింపులకు పూనుకోవడంతో దువ్వూరులోని వై.జంక్షన్ వద్ద అరెస్టు చేసి శనివారం కోర్టుకు హాజరు పరిచినట్లు ఎస్‌ఐ చెప్పారు.

అనుమానాస్పద స్థితిలో యువకుడి మృతి

హత్యా.. ప్రమాదమా...?

పులివెందుల టౌన్, జనవరి 11 (ఆంధ్రజ్యోతి): బసిరెడ్డి పల్లె దారిలో శనివారం రాత్రి అనుమానాస్పద స్థితిలో పాలెంవిజయ్ (23) మృతి చెందాడు. విజయ్ పట్టణంలోని భాకరాపురం జయమ్మ కాలనీలో నివసిస్తున్నాడు. మీషో ఆన్‌లైన్ పార్సల్ సర్వీసులో పనిచేస్తూ ఉన్నాడు. ఒక ప్రమాదం జరిగి యువకుడు మృతి చెందినట్లు పోలీసులకు సమాచారం రావడంతో ట్రాఫిక్ సీఐ హాజీ వల్లి, అర్బన్ ఎస్‌ఐ విష్ణు నారాయణ సంఘటనా స్థలానికి చేరుకుని ప్రమాదంపై ఆరా తీశారు. మృతదేహాన్ని చూసి ప్రమాదం జరిగినట్లు ఆనవాళ్లు నమ్మశక్యంగా కనిపించలేదని చెబుతున్నారు. ఖచ్చితంగా అది హత్యనే అని అనుకుంటున్నట్లు తెలిసింది. ఇది హత్యనా లేక ప్రమాదమా అనేది పోలీసుల విచారణలో తేలాల్సి ఉంది. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.



యువకుడి మృతదేహం

విద్యార్థులు ప్రతిభ కనపరచాలి

ప్రొద్దుటూరు టౌన్, జనవరి 11 (ఆంధ్రజ్యోతి): విద్యార్థులు చదువుతోపాటు కళల్లో ప్రతిభ కనపరచాలని ఎమ్మెల్సీ భూమిరెడ్డి రాంగోపాల్‌రెడ్డి, ఎమ్మెల్యే నంద్యాల వరదరాజులరెడ్డి అన్నారు. శ్రీకృష్ణ గీతాశ్రమంలో శనివారం నటరాజ కళాక్షేత్రం ఆధ్వర్యంలో రాయలసీమ సంగీత నృత్యోత్సవాల్లో ఎమ్మెల్సీ మాట్లాడుతూ మన సంస్కృతి, సంప్రదాయాల్లో కూచిపూడి, భరతనాట్యం, జానపద నృత్యాలు ఎంతో ప్రసిద్ధి పొందాయని, వాటిలో చిన్నారులను ప్రోత్సహించాలన్నారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ భారతీయ సంస్కృతి, సంప్రదాయాలు ప్రపంచ వ్యాప్తంగా గుర్తింపు పొందాయని, మన సంప్రదాయాలను పరిరక్షించుకోవాల్సిన అవసరం ఉందన్నారు. ప్రొద్దుటూరులో కళాక్షేత్రం ఏర్పాటుకు కృషి చేస్తానని తెలిపారు. నటరాజ కళాక్షేత్రం నాట్యగురువు మొహిద్దీన్‌ఖాన్ మాట్లాడుతూ విద్యార్థులను ప్రోత్సహించడానికే రాయలసీమస్థాయి సంగీత నృత్యోత్సవాలను నిర్వహిస్తున్నట్లు తెలిపారు. పలువురు కళాకారులకు రాయలసీమ సంగీతరత్న, కళారత్న అవార్డులను అందజేస్తామన్నారు. విద్యార్థులు ప్రదర్శించిన కూచిపూడి, జానపద నృత్యాలు ఆకట్టుకున్నాయి. రాయలసీమ, బళ్లారి ప్రాంతాల నుంచి 250 మంది కళాకారులు హాజరయ్యారు. కేంద్ర సంగీత నాటక అకాడమి, రాష్ట్రపతి అవార్డు గ్రహీత డాక్టర్ వేదాంతం రాధేశ్యామ్, కేంద్ర సాంస్కృతిక శాఖ సభ్యుడు డాక్టర్ వేదాంతం రామలింగశాస్త్రి, ఎస్వీ సంగీత నృత్య కళాశాల విశ్రాంత ప్రిన్సిపాల్ డాక్టర్ జమునారాణి, నాట్యకళాప్రపూర్ణ డాక్టర్ వెంకటసుబ్రమణ్యం, ఎస్వీ డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ హరినారాయణ పాల్గొన్నారు.



కూచిపూడి నృత్యం ప్రదర్శిస్తున్న చిన్నారులు

15న 'చెయ్యేరంతా సంక్రాంతి' సంబరాలు

నందలూరు, జనవరి 11 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని చెయ్యేటిలో ఈనెల 15న చెయ్యేరంతా సంక్రాంతి సంబరాలు నిర్వహించనున్నట్లు కార్యక్రమ నిర్వాహకులు గుండు మల్లికార్జునరెడ్డి తెలిపారు. ఈ సందర్భంగా శనివారం ఆయన మాట్లాడుతూ 15వ తేదీ మధ్యాహ్నం రెండు గంటలకు ఎద్దుల బండ్ల పోటీలు, మూడున్నర గంటలకు డ్యాన్స్ బేబీ డ్యాన్స్ కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు తెలిపారు. .

లారీ, ఐషర్ ఢీ.. ఇద్దరికి గాయాలు



ఊటుకూరు వద్ద ఢీకొన్న లారీ, ఐషర్ వాహనం

రాజంపేట టౌన్, జనవరి 11 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని కడప - చెన్నై జాతీయ రహదారిలో ఊటుకూరు వద్ద శనివారం లారీ, ఐషర్ ఢీకొనడంతో ఇద్దరికి గాయాలయ్యాయి. ఐషర్‌లో ఇరుక్కుపోయిన డ్రైవర్‌కు తీవ్ర గాయాల య్యాయి. ఊటుకూరు గ్రామ ప్రజలు ట్రాక్టర్ సహాయంతో అతనిని బయటకు తీశారు.

అదుపు తప్పి కారు బోల్తా .. ఐదుగురికి గాయాలు

ఒంటిమిట్ట, జనవరి 11 (ఆంధ్రజ్యోతి) : మండల పరిధిలోని కడప - చెన్నై జాతీయ రహదారిపై పోలు బుచ్చాయగారి పల్లె సమీపంలో శనివారం పులివెందుల నుంచి వెళుతున్న కారు అదుపుతప్పి బోల్తా పడింది. ఈ కారులో ముగ్గురు పెద్దలు, ఇద్దరు పిల్లలు ఉన్నారు. వీరిలో నలుగురికి స్వల్ప గాయాలు కాగా, తీవ్రంగా గాయపడిన హిమబిందును హైవే పెట్రోల్ సిబ్బంది 108 వాహనంలో కడప రిమ్స్‌కు తరలించారు. కేసు దర్యాప్తు చేస్తున్నట్టు ఎస్ఐ శివప్రసాద్ తెలిపారు.

నల్లగంగమ్మకు పూజలు

సుండుపల్లె, జనవరి 11 (ఆంధ్రజ్యోతి): మండలంలోని జీ. రెడ్డివారిపల్లె గ్రామ పంచాయతీ అడవిపల్లెకు వెళ్లే రహదారిలోని నల్లగంగమ్మ ఆలయంలో శనివారం అభిషేకం, పూజలు నిర్వహించారు. పెద్ద సంఖ్యలో భక్తులు పాల్గొన్నారు.

శిథిలావస్థలో కార్యాలయ భవనం

- బిక్కు బిక్కుమంటూ విధులు నిర్వహిస్తున్న వత్తలూరు సబ్‌స్టేషన్ సిబ్బంది
- ఫెన్సింగ్ లేక పోవడంతో చొరబడుతున్న వన్యప్రాణులు



విద్యుత్ ఉపకేంద్ర భవనం (ఇన్‌సర్ట్) వత్తలూరు సబ్‌స్టేషన్

పుల్లంపేట, జనవరి 11 (ఆంధ్రజ్యోతి) : శిథిలావస్థకు చేరుకుని పెచ్చులూడుతున్న భవనం, తాకితే షాక్ కొట్టే గోడలతో ఇప్పుడో, అప్పుడో కూలిపోయే స్థితిలో ఉన్న భవనంలో వత్తలూరు సబ్‌స్టేషన్ సిబ్బంది బిక్కుబిక్కుమంటూ విధులు నిర్వహిస్తున్నారు. కొన్నేళ్లుగా ఈ పరిస్థితి నెలకొన్నా.. ఎవరూ పట్టించుకోవడం లేదని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

పుల్లంపేట మండలంలో సుమారు 40 ఏళ్ల క్రితం తొలి విద్యుత్ సబ్‌స్టేషన్ వత్తలూరు గ్రామంలో. ఏర్పాటైందది. ఈ సబ్‌స్టేషన్ ద్వారా సుమారు 5 పంచాయతీలకు విద్యుత్ సరఫరా అయ్యేది. ఈ సబ్‌స్టేషన్‌లో ఇప్పటికీ పాతకాలపు ట్రాన్స్‌ఫార్మర్‌లు ఉన్నాయి. అప్పట్లో సిబ్బంది కోసం ఇక్కడ నిర్మించిన భవనం ప్రస్తుతం శిథిలావస్థకు చేరింది. ఈ భవనం ఎప్పుడు పడిపోతుందో తెలియని పరిస్థితి. ఇక్కడ నలుగురు సిబ్బంది పని చేస్తుండగా, ఒకరు చనిపోవడంతో ఐదేళ్ల నుంచి ముగ్గురే విధులు నిర్వహిస్తున్నారు. భవనంలో ఉన్న 2 గదుల్లో ఒక గదిని పూర్తిగా మూసివేశారు. రెండో గదిలో బిక్కు బిక్కుమంటూ సిబ్బంది కాలం వెళ్లదీస్తున్నారు. అప్పుడప్పుడు పైకప్పు నుంచి పెచ్చులు కూడా ఊడి పడుతున్నాయి. ఇక వర్షాకాలంలో పైకప్పు ఉరుస్తుంది. గోడలు నెమ్ము ఎక్కుతాయి. గోడలు తాకాలంటే షాక్ కొడుతుండడంతో . సిబ్బంది ఎప్పుడూ గది బయటే ఉంటారు. రాత్రి వేళల్లో అడవి పందులు దాడి చేస్తుంటాయి. వాటికి భయపడి సిబ్బంది పరుగులు తీసిన సంఘటనలు కూడా ఉన్నాయి. చుట్టూ ముళ్ల పొదలు ఉండడంతో విష పురుగులు, అడవి జంతువుల భయం కూడా ఉందది. గ్రామాల్లో ఏర్పాటు చేసిన విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్‌లకు చుట్టూ కంచె వేసి రక్షణ చేస్తారు. కానీ వత్తలూరు 33/11కెవి సబ్‌స్టేషన్‌లో మాత్రం చుట్టూ ఎటువంటి కంచె లేదు. కనీసం గేటు కూడా లేదు. ఎప్పుడు ఎటువైపు నుంచి పశువులు వస్తాయో తెలియని పరిస్థితి. అవి వచ్చినప్పుడు ఏ ప్రమాదం జరుగుతుందోనని సిబ్బంది భయపడుతుంటారు. సబ్‌స్టేషన్‌కు చుట్టూ కంచె లేకపోయినా, గేటు లేకపోయినా కనీసం యార్డుకు కూడా ఫెన్సింగ్ లేదంటే ఎంత నిర్లక్ష్యమో అర్థం చేసుకోవచ్చు. సిబ్బంది సమస్యలను ఎన్నోసార్లు పై అధికారులకు విన్నవించ కున్నా ఫలితం లేదు. ఇకనైనా అధికారులు కిందిస్థాయి సిబ్బందికి భరోసా కల్పించాల్సిన అవసరం ఎంతైనా ఉందని స్థానికులు కోరుతున్నారు.

వడ్డే ఓబన్న పోరాటం స్ఫూర్తిదాయకం



రైల్వేకోడూరులో వడ్డే ఓబన్నవిగ్రహానికి పూలమాల వేస్తున్న ఎమ్మెల్యే అరవ శ్రీధర్, కుడా చైర్మన్ ముక్కా రూపానందరెడ్డి

రైల్వేకోడూరు, జనవరి 11(ఆంధ్రజ్యోతి): స్వాతంత్ర్య సమరయోధుడు వడ్డే ఓబన్న ఉద్యమ పోరాటం స్ఫూర్తిదాయకం అని జనసేన పార్టీ ఎమ్మెల్యే, విప్ అరవ శ్రీధర్, కుడా చైర్మన్ ముక్కా రూపానందరెడ్డి తెలిపారు. వడ్డే ఓబన్న జయంతి సందర్భంగా శనివారం రైల్వేకోడూరులో ఆయన విగ్రహానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళి అర్పించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ వడ్డే ఓబన్న త్యాగాలను, ఆయన జీవితాన్ని స్ఫూర్తిగా యువత తీసుకుని ఎన్నో విజయాలు సాధించాలని కోరారు.వైస్ ఎంపీపీ రామిరెడ్డి ధ్వజారెడ్డి నివాళులు అర్పించారు.

గాలివీడు: వెన్నుచూపని వీరుడు వడ్డే ఓబన్న అని మండల వడ్డెర సంఘం నాయకుడు నాగేశ్వరరావు, శ్రీనివాసులు, జయరాములు కొనియాడారు. శనివారం స్థానిక మండల కేంద్రంలో వడ్డెరల సంఘం నాయకుడు బండల శ్రీనివాసులు ఆధ్వర్యంలో ఘనంగా వడ్డే ఓబన్న జయంతి నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన చిత్రపటానికి పూలమాల వేసి ఘననివాళులు అర్పించారు. శ్రీకాంత్, నాగేశ్, భోగేశ్వరయ్య, మేస్త్రి రమణ, జయరాం, జగన్నాథ, శివశంకర్, శివ, ఆంజనేయులు, బాలాజీ, వీరాంజనేయులు, రమేశ్, నాగరాజు, రామేశ్వర తదితరులు పాల్గొన్నారు.

రాజంపేట : రాజంపేట పట్టణం రామ్‌నగర్‌లో వడ్డెర సంఘం రాష్ట్ర గౌరవాధ్యక్షుడు కేవీ రమణ మాట్లాడుతూ వడ్డే ఓబన్న స్ఫూర్తితో సమైక్యంగా పోరాడి హక్కులు సాధించుకుందామన్నారు. ఈ కార్యక్రమంలో మదనపల్లి పెంచ లయ్య, బత్తుల శ్రీరాములు, జి.వీరభద్రయ్య, కృష్ణయ్య పి.రామయ్య, వెంకటేశ్, కోటకొండ హరి, రాజా, సహదేవ, వెంకటస్వామి, సుబ్రమణ్యం పాల్గొన్నారు.

సిద్దవటం : మండలంలోని 11వ ఏపీఎస్పీ బెటాలియన్‌లో ఇన్‌చార్జి కమాండెంట్ డి.నాగేశ్వరప్ప ఆధ్వర్యంలో. వడ్డే ఓబన్న చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. అసిస్టెంట్ కమాండెంట్ పీఎన్‌డీ ప్రసాద్, ఆర్ఐలు, ఆర్ఎస్ఐలు, సిబ్బంది పాల్గొన్నారు.

పాడిరైతుల సంక్షేమమే ప్రభుత్వ లక్ష్యం



సరస్వతిపల్లెలో గోకులాన్ని ప్రారంభిస్తున్న మండిపల్లి లక్ష్మీప్రసాద్‌రెడ్డి



నందలూరు: మినీ గోకులాన్ని ప్రారంభిస్తున్న మేడా విజయశేఖర్‌రెడ్డి

ఓబులవారిపల్లె, జనవరి 11 (ఆంధ్రజ్యోతి) : పాడిరైతుల సంక్షేమం కోసం రాష్ట్ర ప్రభుత్వం విశేషంగా కృషి చేస్తుందని కుడా చైర్మన్, ఇన్‌చార్జి ముక్కా రూపానందరెడ్డి తెలిపారు. మండలంలోని బొమ్మవరం, బి.కమ్మపల్లి గ్రామాల్లో మినీ గోకులం షెడ్లను ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పశుసంవర్ధకశాఖ, ఉపాది హామీ అధికారులు సమన్వయంతో మినీ గోకులాలను త్వరితగతిన పూర్తి చేసి రైతులకు అందుబాటులోకి తీసుకురావాలన్నారు. ఈ కార్యక్రమంలో బీజేపీ ఇన్‌చార్జి గడ్డం చెంగల్‌రాజు, బొమ్మవరం టీడీపీ నాయకులు ఉమ్మలరాజు పిచ్చిరాజు, ఉమ్మలరాజు సుబ్బరాజు, బి.కమ్మపల్లి సర్పంచ్ చప్పిడి సురేష్‌బాబు, చప్పిడి రమేష్‌బాబు, మాజీ సర్పంచ్ కోడూరు జనార్దన్‌నాయుడు, మాజీ సింగిల్‌విండో సభ్యుడు వేమన సుబ్రమణ్యంనాయుడు, టీడీపీ యూత్ నాయకులు మడుపూరు నరేష్, వెంకటనరసయ్యానాయుడు, గ్రామ ప్రజలు, ఎన్డీయే కూటమి నాయకులు పాల్గొన్నారు.

చిట్వేలి: పాడిరైతుల సంక్షేమం కోసం ప్రభుత్వం విశేష కృషి చేస్తున్నదని ప్రభుత్వ విప్, ఎమ్మెల్యే అరవ శ్రీధర్ అన్నారు పోల్లోపల్లి తిమ్మయ్యగారిపల్లె పంచాయతీ చిల్లావాండ్లపల్లెలో మినీ గోకులాన్ని ముక్కా సాయివికాస్‌రెడ్డితో కలిసి ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో ఎంపీటీసీ సభ్యుడు కృష్ణయ్య బాలు రామాంజనేయులు, గుత్తి నరసింహ, శివరాజు, నారాయణ, చంద్రమోహన్ నాయుడు, నరసింహనాయుడు, మాదాసు నరసింహ, చంగల్‌రాయుడు, బొంతల నాగేశ్వరరావు, తహసీల్దారు రామ్మోహన్‌కృష్ణ, ఎంపీడీవో మోహన్, ఏపీవో చంద్రకళ, పశువుల వైద్యాధికారి భువనేశ్వరి, సీఐ వెంకటేశ్వర్లు, ఎస్ఐ రఘురాం, ఎన్డీయే కూటమి నాయకులు, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

రామాపురం: కల్పనాయునిచెరువు పంచాయతీలోని మూలపల్లిలో మంత్రి మండిపల్లి రాంప్రసాద్‌రెడ్డి సోదరుడు లక్ష్మిసాద్‌రెడ్డి గోకులం షెడ్లను ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాయచోటి నియోజకవర్గంలో సిమెంటు రోడ్లు, మురుగు కాలువలు ఏర్పాటు చేయడంతోపాటు, తాగునీటి సమస్య పరిష్కరిస్తామన్నారు. అనంతరం గువ్వలచెరువులో మండల మైనార్టీ టీడీపీ నాయకుడు ఆజాం తండ్రిని పరామర్శించారు. ఎంపీడీవో జాషు వా, టీడీపీ చంద్రమౌళి, రేఖం ఆంజనేయులు బ్రదర్స్, చెన్నకృష్ణారెడ్డి, కుమార్, గండికోట భాస్కర్‌రెడ్డి, తిమ్మారెడ్డి, ఆజాం, చిట్టి రామసుబ్బయ్య, లోకేశ్, సుధాకర్, ధనుంజయ, అన్నయ్య, మల్లికార్జున, నాగరాజు తదితర సిబ్బంది పాల్గొన్నారు.

నందలూరు : పాడిరైతుల సంక్షేమం కోసం రాష్ట్ర ప్రభుత్వం విశేష కృషి చేస్తోందని టీడీపీ రాష్ట్ర అధికార ప్రతినిధి మేడా విజయశేఖర్‌రెడ్డి అన్నారు. శనివారం ఉదయం మండలంలోని టంగుటూరు గ్రామ పంచాయతీల నూతనంగా నిర్మించిన మినీ గోకులం (పశువుల షెడ్)ను ఆయన ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో ఎంపీడీవో రాధాకృష్ణ, ఏపీవో డిల్లీ బాబు, సర్పంచ్ మొయినుద్దీన్, టీడీపీ గ్రామ కమిటీ అధ్యక్షురాలు షర్మిల, మాజీ ఎంపీటీసీ పఠాన్ అక్బర్‌ఖాన్ తదితరులు పాల్గొన్నారు.

కోడిపందెం, పేకాటరాయుళ్లపై కఠిన చర్యలు

చిట్వేలి, జనవరి 11 (ఆంధ్రజ్యోతి) : సంక్రాంతి సందర్భంగా కోడిపందేలు, పేకాట ఆడేవారిపై కఠినచర్యలు తప్పవని ఎస్ఐ రఘురాం హెచ్చరించారు. ఈ మేరకు శనివారం స్థానిక పోలీసు స్టేషన్‌లో ఎస్ఐ మాట్లాడుతూ కోడిపందెం ఆడుతూ పట్టుబడితే కేసులు నమోదు చేయడంతో పాటు కఠినంగా వ్యవహరిస్తా మన్నారు. కోడిపందెంరాయుళ్లపై ప్రత్యేక నిఘా ఉంచామన్నారు. మండలంలో కోడిపందేలు జరిగే స్థలాలను ఇప్పటికే గుర్తించామన్నారు. ప్రత్యేక పోలీసు బృందాలను ఏర్పాటు చేశామన్నారు. పట్టుబడితే ఉక్కుపాదం మోపుతామని ఎస్ఐ రఘురాం హెచ్చరించారు.



జీఎన్ నాయుడుకు సత్కారం



జీఎన్‌నాయుడును సత్కరిస్తున్న యెద్దల సుబ్బరాయుడు

నందలూరు, జనవరి 11 (ఆంధ్రజ్యోతి) : స్థానిక సౌమ్యనాథస్వామి ఆలయంలో రీజెన్సీ పరిశ్రమల అధినేత డాక్టర్ జీఎన్ నాయుడును ఆర్టీసీ మాజీ చైర్మన్ యెద్దల సుబ్బరాయుడు ఆధ్వర్యంలో ఘనంగా సత్కరించారు. ముక్కోటి ఏకాదశి సందర్భంగా డాక్టర్ జీఎన్‌నాయుడు ఉత్తర ద్వారంనుంచి సౌమ్యనాథస్వామిని దర్శించుకున్నారు. ఈ సందర్భంగా ఆయనను ఆలయ కమిటీ సభ్యులు శాలువా, పూలమాలతో సత్కరించి తీర్థ ప్రసాదాలు అందజేశారు. ఈ కార్యక్రమంలో ఎంపీటీసీ మాజీ సభ్యుడు సుబ్రమణ్యం నాయుడు, పెంచలయ్యానాయుడు తదిత రులు పాల్గొన్నారు.

రాజంపేటలో లోపించిన పారిశుధ్యం



వ్యర్థాలను తింటున్న ఆవులు

రాజంపేట, జనవరి 11 (ఆంధ్రజ్యోతి) : పట్టణంలో ఎక్కడ చూసినా చెత్తా చెదారం పేరు కుపోయింది. ప్రధాన కూడళ్లతో పాటు, పాత బస్టాండ్, నూనెవారిపల్లె రోడ్డు, మన్నూరు, ఉస్మాన్‌నగర్ తదితర ప్రాంతాల్లో మున్సిపల్ సిబ్బంది చాలా కాలంగా చెత్త తొలగించకపోవడంతో ఈగలు, దోమలు విజృంభిస్తున్నాయి. అధికారులు స్పందించి చర్యలు తీసుకోవాలని ప్రజలు కోరుతున్నారు

పేద మహిళలకు చీరలు పంపిణీ



పేద మహిళలకు చీరలు పంపిణీ చేస్తున్న మంత్రి మండిపల్లి సతీమణి హరిత

రాయచోటిటౌన్, జనవరి 11 (ఆంధ్రజ్యోతి): పట్టణంలోని రాజుల కాలనీలో శనివారం టీడీపీ నాయకురాలు లక్ష్మీదేవి ఆధ్వర్యంలో సంక్రాంతి పండుగ సందర్భంగా 300 మంది పేద మహిళలకు రాష్ట్ర రవాణా శాఖ మంత్రి మండిపల్లి రాంప్రసాద్‌రెడ్డి సతీమణి హరిత చీరలు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు మహి ళల సంక్షేమా నికి అహర్నిశలు కృషి చేస్తున్నారన్నారు. ఈ కార్యక్రమంలో టీడీపీ నాయకురాలు లక్ష్మీదేవి, జిల్లా మహిళ మాజీ కార్యదర్శి సుజాత, పోలిశెట్టి సు రేశ్, నిక్షిత్, వెంకట సుబ్బయ్య, వెంకట్రమణ, పల్లవి, అనిత, బుజ్జి, ఈశ్వరమ్మ, పార్వతి, నందిని తదితరులు పాల్గొన్నారు.

సంక్రాంతి సంబరాల్లో విద్యార్థులు



విచిత్ర వేషధారణ లో విద్యార్థులు

రైల్వేకోడూరు, జనవరి 11(ఆంధ్రజ్యోతి): స్థానిక విజ్‌డమ్ స్కూలులో శనివారం సంక్రాంతి సంబరాలు నిర్వహించారు. విద్యార్థులకు భోగి పండ్లతో ఆశీర్వాదం చేశారు. వివిధ రకాల ముగ్గులు వేశారు. పలు సాంస్కృతిక కార్యక్ర మాలు నిర్వహించారు. హరి దాసు, సోదమ్మ తదితర వేషాలు వేసి అందరిని అలరించారు. ఈ కార్య క్రమంలో స్కూలు చైర్మన్ టి. ప్రదీప్, డైరెక్టర్ టి. మదన్‌మోహన్, ప్రిన్సిపాల్ టి. ప్రియాంక, ఉపాధ్యాయులు,విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

అటవీ ప్రాంతం హద్దుల గుర్తింపునకు సర్వే



సర్వే చేస్తున్న రెవెన్యూ, ఫారెస్ట్ సిబ్బంది

సిద్దవటం, జనవరి 11 (ఆంధ్రజ్యోతి) : అటవీ ప్రాంతంలో హద్దుల ఏర్పాటుకు శనివారం రెవెన్యూ, ఫారెస్ట్ అధికారులు సర్వే నిర్వహించారు. మండలంలోని గుండ్లమాల అటవీ ప్రాంతంలో బ్రిటిష్ కాలంలో ఏర్పాటు చేసిన హద్దులు గుర్తించారు. ఈ సందర్భంగా మండల సర్వేయర్ నాగ భూషణంరెడ్డి మాట్లాడుతూ జిల్లాలో గుండ్లమాల గ్రామాన్ని పైలట్ విలేజ్ అధికారులు గుర్తించారని, దీని ద్వారా రెవెన్యూ అటవీ ప్రాంతాలకు సంబంధించిన భూములు, హద్దులు ఏర్పాటు చేయనున్నట్లు ఆయన తెలిపారు. ఈ కార్యక్రమంలో ఫారెస్ట్, రెవెన్యూ సిబ్బంది పాల్గొన్నారు.

సిద్దవటం అటవీ ప్రాంతంలో కూంబింగ్



అటవీ ప్రాంతంలో కూంబింగ్ నిర్వహిస్తున్న ఫారెస్ట్ సిబ్బంది

సిద్దవటం, జనవరి 11 (ఆంధ్రజ్యోతి) : ఎఫ్ఆర్వో కళావతి ఆధ్వర్యంలో శనివారం రోళ్లబోడు, గొల్లపల్లి, సిద్దవటం బీట్లలో కూంబింగ్ నిర్వహించారు. ఎర్ర చందనం స్మగ్లర్లు అడవిలోకి ప్రవేశించకుండా స్పెషల్ టీమ్స్ ఏర్పాటు చేసి కూంబింగ్ నిర్వహిస్తున్నామని ఫారెస్ట్ రేంజ్ అధికారి కళా వతి తెలిపారు. కొత్త వ్యక్తులు ఎవరైనా కనిపిస్తే వెంటనే అటవీశాఖ అధికారులకు తెలియజేయాలని అటవీ సమీప గ్రామాల ప్రజలను కోరా రు. గొల్లపల్లి డిప్యూటీ రేంజ్ ఆఫీసర్ కె.ఓబులేశు, గొల్లపల్లి ఎఫ్‌బీవో మధు, రోళ్లబోడు ఎఫ్‌బీవో ఆది విశ్వనాథ్, సిద్దవటం ఎఫ్‌బీవో పెంచల్‌రెడ్డి, బేస్‌క్యాంపు సిబ్బంది, స్ట్రైకింగ్ ఫోర్స్ సిబ్బంది పాల్గొన్నారు.

ఏఐవైఎఫ్ మహా సభలను విజయవంతం చేయాలి

రైల్వేకోడూరు, జనవరి 11(ఆంధ్రజ్యోతి): ఏఐవైఎఫ్ 22వ రాష్ట్ర ఏఐవైఎఫ్ రాష్ట్ర మహా సభలను విజయవంతం చేయాలని ఏఐవైఎఫ్ జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు దార్ల రాజశేఖర్, జక్కల వెంకటేష్ తెలిపారు. శనివారం సీపీఐ రైల్వేకోడూరు కార్యాలయం లో గోడపత్రాలను విడుదల చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ శ్రీకాకుళం లో ఫిబ్రవరి 6,7,8,9 తేదీల్లో నాలుగు రోజులపాటు నిర్వహిస్తారన్నారు. ఈ కార్యక్రమం లో జాఫర్, హరి, కుమార్, నరసయ్య తదితరులు పాల్గొన్నారు.

యాచకులకు దుప్పట్లు పంపిణీ




యాచకులకు దుప్పట్లు పంపిణీ చేస్తున్న మానవత సేవా సంస్థ నిర్వాహకులు


రైల్వేకోడూరు, జనవరి 11 (ఆంధ్రజ్యోతి): పట్టణంలోని యాచకులకు మానవతా సేవా సంస్థ శనివారం దుప్పట్లు పంపిణీ చేసింది సాయిబాబా ఆలయం తదితర ఏరియాల్లో రాత్రి వేళల్లో నిద్రించే యాచకులకు దుప్పట్లు పంపిణీ చేసినట్లు ఆ సంస్థ చైర్మన్ కే. ప్రసాద్‌వర్మ తెలిపారు. ఈ కార్యక్రమంలో సహాయ చైర్మన్ టి. వెంకటరమణ యాదవ్, ప్రెసిడెంట్ ఎం. చంద్రమోహన్ రాజు, డైరెక్టర్లు ఏ. శ్రీనివాసులు, పి. ఉదయశంకర్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

'ముక్కా' ఇంటికి మంత్రి మండిపల్లి

ఓబులవారిపల్లె, జనవరి 11 (ఆంధ్రజ్యోతి) : కుడా చైర్మన్ ముక్కా రూపానందరెడ్డి ఆహ్వానం మేరకు మంత్రి మండిపల్లి రాంప్రసాద్‌రెడ్డి శనివారం ఆయన ఇంటిని సందర్శించారు. . ఈ సందర్భంగా ప్రజలు పలు సమస్యలపై వినతిపత్రాలు సమర్పించారు. మంగంపేట ఏపీఎండీసీ కార్మిక సంఘాల నాయకులతో పలు సమస్యలపై చర్చించారు. ఈ సందర్భంగా ఆర్డీవో వినోద్‌కుమార్ మంత్రిని కలిసి పుష్పగుచ్ఛం అందజేశారు.

మున్సిపల్ ఇంజనీరింగ్ సెక్షన్ కార్యవర్గం ఎన్నిక





అక్బర్ అలీఖాన్, ఈశ్వర్‌రెడ్డి

రాయచోటిటౌన్, జనవరి 11 (ఆంధ్రజ్యోతి): ఏపీ మున్సిపల్ వర్కర్స్ అండ్ ఎంప్లాయిస్ యూనియన్ ఇంజనీరింగ్ సెక్షన్ రాయచోటి పట్టణ కమిటీని శనివారం జిల్లా అధ్యక్షుడు బీవీ రమణ ఆధ్వర్యంలో ఎన్నుకున్నారు. ఈ సందర్భంగా గౌరవాధ్యక్షుడుగా శంకరయ్య, అధ్యక్షుడుగా అక్బర్ అలీఖాన్, ఉపాధ్యక్షుడుగా చంద్రశేఖర్, ప్రధాన కార్యదర్శి ఎం. ఈశ్వర్‌రెడ్డి, కోశాధికారి డీకే దేవనాథ్, కమిటీ సభ్యులు కేవీ రమణ, షకీల్‌బేగ్, చెన్నారెడ్డి, శివారెడ్డి, వెంకట్రామయ్య, వెంకట రమణ నాయుడు, జేవీ రమణారెడ్డి, రమాదేవి, రెడ్డిప్రసాద్, గోపాల్ ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు.

కువైత్‌లో సంక్రాంతి సంబరాలు



సంక్రాంతి సంబరాల్లో రాజంపేటకు చెందిన క్షత్రియులు

రాజంపేట, జనవరి 11 (ఆంధ్రజ్యోతి) : కువైత్‌లో రాజంపేట ప్రవాసాంధ్రులు శనివారం సంక్రాంతి సంబరాలు చేసుకున్నారు. క్షత్రియ సామాజిక వర్గానికి చెందిన పలువురు పాల్గొన్నారు. కోలాటం, చెక్కభజన, గొబ్బెమ్మ, చిన్న పిల్లల ఆటలు, ముగ్గులు పోటీలు నిర్వహించారు. శుభాకాంక్షలు తెలియజేసుకున్నారు.

అవనిపై హరివిల్లు

విజయవాడలో సందడిగా 'ఆంధ్రజ్యోతి-ఏబీఎన్' ముత్యాల ముగ్గుల పోటీల ఫైనల్స్

ఆంధ్రజ్యోతి, ఏబీఎన్ నిర్వహిస్తున్న సంతూర్ ముత్యాల ముగ్గుల పోటీలు.. గార్డెనింగ్ పార్టనర్ క్రాఫ్ట్‌వారి పర్‌ఫెక్ట్, ఫ్యాషన్ పార్టనర్ డిగ్‌సెల్ వారి సెల్సియా (ట్రెండీ మహిళల ఇన్నర్‌వేర్) ఫైనల్స్ శనివారం ఘనంగా జరిగాయి. విజయవాడలోని నారా చంద్రబాబు నాయుడు కాలనీలోని బ్యాడ్మింటన్ కోర్టులో నిర్వహించిన ఈ పోటీల్లో రాష్ట్రంలోని 13 ఉమ్మడి జిల్లాలతో పాటు తమిళనాడు, కర్ణాటక విజేతలు కలిపి మొత్తం 15 మంది పాల్గొన్నారు. ప్రథమ బహుమతిని కె.భార్గవి (తమిళనాడు) సొంతం చేసుకోగా, మూడు ద్వితీయ బహుమతులను రమ్య (కడప), సావిత్రి (తూర్పు గోదావరి), వేణుభార్గవి (పశ్చిమ గోదావరి) సొంతం చేసుకున్నారు. మిగిలిన 11 మంది కన్సొలేషన్ బహుమతులు అందుకున్నారు. బహుమతుల ప్రదానోత్సవానికి హోంమంత్రి వంగలపూడి అనిత ముఖ్య అతిథిగా విచ్చేయగా, ఉమ్మడి కృష్ణా జిల్లాపరిషత్ మాజీ చైర్‌పర్సన్ గద్దె అనూరాధ జ్యోతి వెలిగించి ఫైనల్స్ పోటీలను ప్రారంభించారు. ఏపీ సెంట్రల్ డెస్క్ ఇన్‌చార్జి టి.సురేష్, న్యూస్ ఎడిటర్ కె.నాగసుధాకర్, విజయవాడ యూనిట్ మేనేజర్ వి.మురళీ తదితరులు పాల్గొన్నారు. న్యాయనిర్ణేతలుగా అబ్బూరి రత్నలక్ష్మి, నూరపనేని ఉషారాణి వ్యవహరించారు.

- ఆంధ్రజ్యోతి, విజయవాడ

ప్రథమ బహుమతి గెలుచుకున్న తమిళనాడు మహిళ

కడప, తూర్పు, పశ్చిమ గోదావరి జిల్లాలకు ద్వితీయ బహుమతులు

11 మందికి కన్సొలేషన్ బహుమతులు

బహుమతులు ప్రదానం చేసిన హోంమంత్రి అనిత







ఫైనల్స్‌లో ముగ్గులు వేస్తున్న పోటీదారులు (ఇన్‌సెట్‌లో) పోటీదారులతో కలిసి జ్యోతి వెలిగిస్తున్న కృష్ణాజిల్లాపరిషత్ మాజీ చైర్‌పర్సన్ గద్దె అనూరాధ





ద్వితీయ బహుమతులు అందుకుంటున్న రమ్య (కడప), సావిత్రి (తూర్పు గోదావరి), వేణుభార్గవి (పశ్చిమ గోదావరి).. (కుడి నుంచి ఎడమకు), ముగ్గులు పరిశీలిస్తున్న మంత్రి అనిత





కన్సొలేషన్ బహుమతులు అందుకుంటున్న పి.జ్యోతి (శ్రీకాకుళం), ఎం.రాజు (విజయనగరం), నాగమల్లేశ్వరి (కృష్ణా), డి.ఉష (నెల్లూరు), కవిత (ప్రకాశం), ఏ.సునీత (గుంటూరు), జి.శ్రీలక్ష్మి (కర్నూలు), ఎస్.రమ్యకృష్ణ (అనంతపురం), రెడ్డిరాణి (చిత్తూరు), ఏ.సంతోషి (విశాఖపట్నం), రోహిణి (కర్ణాటక). చిత్రంలో ఏపీ సెంట్రల్ డెస్క్ ఇన్‌చార్జి టి.సురేష్, న్యూస్ ఎడిటర్ కె.నాగసుధాకర్, విజయవాడ యూనిట్ మేనేజర్ వేమూరి మురళీ, న్యాయనిర్ణేత అబ్బూరి రత్నలక్ష్మి

భావితరాలకు స్ఫూర్తి వడ్డే ఓబన్న

నివాళులర్పించిన మంత్రి మండిపల్లి రాంప్రసాద్‌రెడ్డి




వడ్డే ఓబన్న చిత్రపటానికి నివాళులర్పిస్తున్న మంత్రి మండిపల్లి రాంప్రసాద్‌రెడ్డి

రాయచోటిటౌన్, జనవరి 11 (ఆంధ్రజ్యోతి): స్వాతంత్ర్య సమరయోధుడు వడ్డే ఓబన్న త్యాగాలు భావితరాలకు స్ఫూర్తిదాయకమని మంత్రి మండిపల్లి రాంప్రసాద్‌రెడ్డి అన్నారు. వడ్డే ఓబన్న జయంతి సందర్భంగా శనివారం రాయచోటి పట్టణంలోని స్టేట్ గెస్ట్‌హౌస్‌లో వడ్డే ఓబన్న చిత్రపటానికి మంత్రి పూలమాల వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ వడ్డే ఓబన్న జయంతి ఉత్సవాలను ప్రభుత్వం అధికారికంగా నిర్వహించడం ఎంతో సంతోషంగా ఉందన్నారు. వడ్డే ఓబన్న స్వాతంత్ర్య సమరయోధుడు, యుద్ధ వీరుడు అని ఉయ్యాలవాడ నరసింహారెడ్డికి సర్వ సైనాధ్యక్షుడిగా ఉండి బ్రిటిషర్లపై పోరాడి ప్రాణ త్యాగం చేశారన్నారు. కార్యక్రమంలో పలువురు టీడీపీ నాయకులు, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

చౌకధరల దుకాణ డీలర్ పరీక్షల్లో 257 మంది అర్హులు

మదనపల్లె టౌన్, జనవరి 11 (ఆంధ్రజ్యోతి): మదనపల్లె రెవెన్యూ డివిజన్‌లో ఖాళీగా ఉన్న చౌకధరల దుకాణ డీలర్ల నియామకం కోసం నిర్వహించిన పరీక్షల్లో 257 మంది అర్హులైనట్లు సబ్‌కలెక్టర్ మేఘస్వరూప్ శనివారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. మదనపల్లె రెవెన్యూ డివిజన్‌లో ఖాళీగా ఉన్న చౌక ధరల దుకాణాల డీలర్ల నియామకం కోసం గత నెల 31వ తేదీ మదనపల్లెలో రాత పరీక్షలు నిర్వహించారు. 709 మంది దరఖాస్తు చేసుకోగా 369 మంది రాత పరీక్షలు రాశారు. ఈ క్రమంలో శనివారం విడుదల చేసిన ఫలితాల్లో 257 మంది అర్హులైనట్లు సబ్ కలెక్టర్ ప్రకటించారు. కాగా 15 దుకాణాలపై కొందరు హైకోర్టుకు వెళ్లి ఉత్తర్వులు తీసుకొచ్చారని, మిగిలిన దుకాణాలకు అర్హులైన వారికి ఇంటర్వ్యూలు నిర్వహిస్తామన్నారు. ఫలితాలను ఆయా మండలాల తహసీల్దార్ కార్యాలయాల నోటీసు బోర్డులో ఉంచుతామని తెలిపారు.

స్కానింగ్ యంత్రాలు స్వాధీనం



స్కానింగ్ పరికరాలను స్వాధీనం చేసుకుంటున్న దృశ్యం

పీలేరు, జనవరి 11 (ఆంధ్రజ్యోతి): పీలేరులోని నోబుల్ నర్సింగ్ హోంలో ఉన్న స్కానింగ్ యంత్రాలను శనివారం జిల్లా వైద్య శాఖాధికారులు స్వాధీనం చేసుకున్నారు. కలెక్టర్ చామకూరి శ్రీధర్ ఆదేశాల మేరకు వైద్య శాఖాధికారి డాక్టర్ కొండయ్య సూచనల మేరకు ఆ నర్సింగ్ హోంలోని యంత్రాలను జిల్లా ఇమ్యునైజేషన్ అధికారిణి డాక్టర్ ఉషశ్రీ పర్యవేక్షణలో అధికారులు స్వాధీనం చేసుకుని రాయచోటికి తరలించారు. లింగ నిర్ధారణ పరీక్షలు చేస్తున్నారన్న సమాచారంతో గత ఏడాది సెప్టెంబరు 13వ తేదీ జిల్లా అధికారులు నోబుల్ నర్సింగ్ హోంపై దాడులు నిర్వహించి ఆ ఆసుపత్రి వైద్యులు డాక్టర్ జి.బాషాను పట్టుకున్నారు. అప్పట్లో ఆసుపత్రిని, ఆసుపత్రిలోని స్కానింగ్ యంత్రాలను సీజ్ చేశారు. అయితే సీజ్ చేసిన యంత్రాలను అధికారుల స్వాధీనంలో ఉంచుకోవాలని ఇటీవల కలెక్టర్ ఆదేశించడంతో వైద్య శాఖాధికారులు వాటిని రాయచోటికి తరలించారు. యంత్రాల స్వాధీనంలో ఎటువంటి ఇబ్బందులు తలెత్తకుండా పీలేరు అర్బన్ సీఐ యుగంధర్ సహకరించారు. కార్యక్రమంలో వైద్య ఆరోగ్య శాఖ సిబ్బంది కుసుమ, ఉషారాణి, తదితరులు పాల్గొన్నారు.

ఉపాధి హామీ పనుల్లో సిబ్బంది చేతివాటం

- ఫీల్డ్ అసిస్టెంట్లు, టెక్నికల్ అసిస్టెంట్ సస్పెన్షన్
- చనిపోయిన వారి పేరిట ఉపాధి బిల్లులు
- వలంటీర్లు, ఉద్యోగులూ కూలీలే
- రూ.20 లక్షలు తినేశారు..
- సిబ్బందిపై వేటు వేసిన డ్వామా పీడీ

గుర్రంకొండ, జనవరి 11 (ఆంధ్రజ్యోతి): ఉపాధి హామీ పనుల్లో చేతివాటం చూపిన సిబ్బందిపై డ్వామా పీడీ ఆగ్రహం వ్యక్తం చేసి ముగ్గురు ఫీల్డ్ అసిస్టెంట్లతో పాటు ఒక టెక్నికల్ అసిస్టెంట్‌ను సస్పెండ్ చేశారు. అంతేకాకుండా సిబ్బంది నుంచి రూ.39,452 రికవరీ చేశారు. వివరాలిలా ఉన్నాయి. ఏళ్ల క్రితం చనిపోయిన వ్యక్తులు కూడా ఉపాధి హామీ పథకంలో పనులు చేశారు. వారి ఆత్మలు వచ్చి డబ్బులు డ్రా చేసుకున్నాయి. ట్రాన్స్‌కో, మోడల్ పాఠశాలల్లో పనిచేసే ఉద్యోగులు కూడా రోజూ ఉపాధి పనులు చేయడం విశేషం. వైసీపీ ప్రభుత్వ హయాంలో వలంటీర్లగా ఉంటూనే ఉపాధి పథకంలో పనులు చేసి వేలాది రూపాయలను సొమ్ము చేసుకుని అవినీతికి పాల్పడిన సంఘటనలు సామాజిక తనిఖీ బహిరంగ సమావేశంలో వెలుగుచేశాయి.

గుర్రంకొండ మండలంలో ఉపాధి హామీ పథకంలో చేసిన వివిధ పనులను సామాజిక తనిఖీ బృందం వారం రోజులపాటు తనిఖీ చేసింది. ఇందులో భాగంగా మండలంలో రూ.7.77 కోట్లతో పనులు చేశారు. ఈ పనులను తనిఖీ బృందం పరిశీలించి వివరాలను అధికారులకు నివేదిక ఇచ్చారు. దీంతో డ్వామా పీడీ వెంకటరత్నం ఆధ్వర్యంలో శనివారం సామాజిక తనిఖీ బహిరంగ సభ నిర్వహించారు. ఈ సభలో ఆయన వివరాలను వెల్లడించారు. అమిలేపల్లె గ్రామానికి సుధాకర్ ట్రాన్స్‌కో శాఖలో కాంట్రాక్ట్ ఉద్యోగిగా పనిచేస్తూ ఉపాధి హామీ పథకంలో కూలీ పనులు చేసి సొమ్ము తీసుకున్నాడు. వనజ అనే మహిళ ఓ మండలంలోని మోడల్ పాఠశాలలో ఉద్యోగిగా ఉంటూనే గ్రామంలో ఉపాధి పనులు చేసినట్లు చూపి అవినీతికి పాల్పడినట్లు తనిఖీ బృందం నిర్ధారించింది. శెట్టివారిపల్లె పంచాయతీలో పి.రామచంద్ర అనే వ్యక్తి 2017వ సంవత్సరంలో చనిపోగా 2023వ సంవత్సరంలో ఉపాధి పనులు చేసినట్లు చూపారు. అలాగే అదే పంచాయితీకి చెందిన సి.వెంకటప్ప 2019లో చనిపోతే 2023లో ఉపాధి పనులు చేసినట్లు చూపి సొమ్ము డ్రా చేసినట్లు తనిఖీ బృందం వెల్లడించింది. అలాగే టి.రాచపల్లెకు చెందిన రాజశేఖర్, మర్రిపాడుకు చెందిన మరో నలుగురు, అమిలేపల్లెకు చెందిన ఇద్దరు వలంటీర్లు ఉపాధి పనులు చేసి అవినీతికి పాల్పడినట్లు బహిరంగ సభలో వెలుగుచూసింది. అమిలేపల్లె గ్రామంలో రాయునిచెరువులో అమృత్ సరోవర్ పథకంలో మినీ ట్యాంక్ పనులు చేయకుండానే రూ.3,85 లక్షలు, రాయునిచెరువు నుంచి దిగువచెరువుకు వెళ్లే వంక పనులు చేయకుండానే రూ.3 లక్షలు, రైతుల భూమిలో చేయాల్సిన ఫారంపాండ్‌ను ప్రభుత్వ భూమిలో చేయడంతో రూ.36 వేలు, రాయునిచెరువుకు వచ్చే మరో వంక పనులకు రూ.1,49 లక్షల పనుల్లో అవినీతికి జరిగినట్లు తనిఖీ బృందం గుర్తించింది.

అలాగే రైతుల భూముల్లో రోజా మొక్కల పెంపకం పనుల్లో భాగంగా అమిలేపల్లెకు చెందిన నలుగురు రైతుల పొలాల్లో 4 వేల రోజా మొక్కలు పెంచుతున్నారు. ఈ రోజా మొక్కల పెంపకం పనుల్లో సుమారు 3 వేలు మొక్కలు లేకుండానే వేలాది రూపాయలు బిల్లులు చేసినట్లు తనిఖీ బృందం నిర్ధారించింది. అలాగే పొలాల్లో చేసే రింగ్ ట్రెంచ్‌ల పనుల్లో రూ.39 వేల అవినీతిని గుర్తించారు. వివిధ గ్రామాల్లో మస్టర్లలో బినామీ పేర్లతో వేలాది రూపాయలను స్వాహా చేసినట్లు తెలిపారు. పనుల వద్ద ఏర్పాటు చేసే బోర్డులు లేకుండానే సొమ్ము చెల్లించినట్లు తనిఖీ బృందం నిర్ధారించింది. హౌసింగ్ పథకంలో పునాది పనులు చేయకుండానే బిల్లులు చేసినట్లు తెలిపారు. అలాగే మస్టర్‌లో కూలీల సంతకాలు కూడా ఒక్కరే చేసి నిధులు స్వాహా చేసినట్లు నిర్ధారించారు. రైతుల పొలాల్లో మొక్కల పెంపకం పనులకు సంబంధించి ఐదు గ్రామాలకు చెందిన రైతుల సొమ్మును ఎల్లుట్ల ఫీల్డ్ అసిస్టెంట్ ఖాతాకు రూ.1,02,188లను టెక్నికల్ అసిస్టెంట్ రవినాయక్ ట్రాన్స్‌ఫర్ చేసినట్లు తనిఖీ బృందం నిర్ధారించింది. ఉపాధి హామీ పథకంలో జరిగిన పనుల్లో రూ.20 లక్షల వరకు అవినీతి జరిగినట్లు తనిఖీ బృందం నిర్ధారించింది. కార్యక్రమంలో ఏపీడీ లక్ష్మీనరసింహ, ఎంపీడీవో వెంకటేశులు, ఏపీవో జయరామిరెడ్డి, ఎస్ఆర్పీ సుబ్బారావు, నాయకులు జగదీష్, ఎల్లుట్ల మురళీ, కార్యదర్శులు, సిబ్బంది పాల్గొన్నారు.



ఫీల్డ్, టెక్నికల్ అసిస్టెంట్లపై ఆగ్రహం వ్యక్తం చేస్తున్న పీడీ వెంకటరత్నం

నలుగురి సస్పెన్షన్

ఉపాధి పనుల్లో అవినీతికి పాల్పడిన ముగ్గురు ఫీల్డ్ అసిస్టెంట్లు, ఒక టెక్నికల్ అసిస్టెంట్‌ను సస్పెండ్ చేసినట్లు డ్వామా పీడీ వెంకటరత్నం తెలిపారు. అమిలేపల్లె ఫీల్డ్ అసిస్టెంట్ లోకనాథ్‌ను శాశ్వతంగా తొలగించినట్లు తెలిపారు. అలాగే ఎల్లుట్ల ఫీల్డ్ అసిస్టెంట్ శంకరయ్య, శెట్టివారిపల్లె ఫీల్డ్ అసిస్టెంట్ సిమ్రాన్‌లను తాత్కాలికంగా తొలగించినట్లు తెలిపారు. అలాగే టెక్నికల్ అసిస్టెంట్ రవినాయక్‌ను కూడా తాత్కాలింగా తొలగించినట్లు డ్వామా పీడీ తెలిపారు.

రూ.39,452 రికవరీ...

మండలంలోని జరిగిన ఉపాధి పథకం బహిరంగ సభలో రూ.39,452ను రికవరీ చేసినట్లు డ్వామా పీడీ తెలిపారు. ఇందులో భాగంగా ఏపీవో నుంచి రూ.3500, ఈసీ నుంచి రూ.8700, బీఎఫ్‌టీ నుంచి రూ.1500, టీఏ రవి నుంచి రూ.17,351, టీఏ మదన్ నుంచి రూ.1000, సీవో (కంప్యూటర్ ఆపరేటర్)లు రెడ్డెప్ప నుంచి రూ.5274, పుణ్యవతి నుంచి రూ.2127 మొత్తం రూ.39,452 నగదును రికవరీ చేసినట్లు తెలిపారు.

మంత్రి మండిపల్లి హామీతో సమ్మె విరమణ



కార్మిక సంఘాలతో చర్చిస్తున్న మంత్రి, ఎమ్మెల్యే, తదితరులు

ఓబులవారిపల్లె, జనవరి 11 (ఆంధ్రజ్యోతి) : ఏపీఎండీసీ కార్మిక సమస్యలను పరిష్కరిస్తామని మంత్రి మండిపల్లి రాంప్రసాద్‌రెడ్డి హామీ ఇవ్వడంతో కార్మికులు సమ్మె విరమించారు. ఏపీఎండీసీ కార్మికులు తొమ్మిది రోజులుగా వారి హక్కుల సాధన కోసం చేస్తున్న ఉద్యమాన్ని తెలుసుకొని మంత్రితో ఎమ్మెల్యే అరవ శ్రీధర్, టీడీపీ ఇన్‌చార్జి, కుడా చైర్మన్ ముక్కారూపానందరెడ్డితో కలిసి కార్మికులతో చర్చలు జరిపారు. మంగంపేట గ్రామ పెద్దలు ఈ చర్చల్లో ఉన్నారు. కార్మిక సంఘాలు ఇచ్చిన సమ్మె నోటీసులో ఉన్న ఐదు డిమాండ్ల పైన మంత్రి చర్చలు జరిపి ఈ సమస్యలన్నీ 25వ తేదీ లోపు విజయవాడలో గనుల శాఖ మంత్రితో పాటు ప్రిన్సిపల్ సెక్రటరీ, ఏపీఎండీసీ ఎండీతో మీటింగ్ ఏర్పాటు చేయించి సమస్యలు పరిష్కరిస్తామని హామీ ఇచ్చారు. సమావేశం ఏర్పాటు చేసేంతవరకు ఉద్యమాన్ని వాయిదా వేయాలని మంత్రి కోరగా సమ్మెను తాత్కాలికంగా 15 రోజులు వాయిదా వేస్తున్నట్లు కార్మిక సంఘాల నాయకులు తెలిపారు. కార్యక్రమంలో అన్ని ఏపీఎండీసీ కార్మిక సంఘాల నాయకులు, గ్రామ పెద్దలు పాల్గొన్నారు.

కూతుర్లపై అఘాయిత్యానికి పాల్పడిన తండ్రి అరెస్ట్

నిమ్మనపల్లి, జనవరి 11 (ఆంధ్రజ్యోతి): కన్న కూతుర్లపై అఘాయిత్యానికి పాల్పడిన తండ్రిని అరెస్ట్ చేసినట్లు డీఎస్పీ కొండయ్య తెలిపారు. శనివారం ఆయన మాట్లాడుతూ నిమ్మనపల్లి మండలంలోని ఓ గ్రామానికి చెందిన వ్యక్తి సొంత కూతుళ్లపై అఘాయిత్యానికి పాల్పడినట్లు తల్లి ఫిర్యాదు చేసిందన్నారు. గ్రామంలో విచారణ చేసి నిందితుతడిని అరెస్ట్ చేసినట్లు తెలిపారు. కార్యక్రమంలో సీఐ రమేష్‌బాబు, ఎస్ఐ తిప్పేస్వామి పాల్గొన్నారు.

తల్లి మందలించిందని కూతురు ఆత్మహత్య

రామసముద్రం, జనవరి 11 (ఆంధ్రజ్యోతి): తల్లి మందలించడంతో కూతురు మనస్థాపం చెంది ఆత్మహత్య చేసుకుంది. మృతురాలి తల్లి సుకన్య వివరాల మేరకు.. మండల కేంద్రానికి చెందిన సుకన్య కూతురు కణ్యేశ్వరి (15) కర్ణాటకలోని సోమయాజులపల్లెలో పదో తరగతి చదువుతోంది. శనివారం ఇంటి వద్ద కూతురు సెల్‌ఫోన్ చూస్తుండటంతో తల్లి మందలించింది. దీంతో మనస్థాపం చెందిన కణ్యేశ్వరి పురుగుల మందు తాగింది. మదనపల్లె ఆస్పత్రికి తరలిస్తుండగా మృతి చెందిందని తల్లి తెలిపింది.

లేగదూడల పెంపకంలో మెలకువలు పాటించాలి

- జిల్లా పశువైద్యాధికారి డాక్టర్ శారదమ్మ



విజేతలకు బహుమతులు అందిస్తున్న జిల్లా పశువైద్యాధికారి

చెన్నూరు, జనవరి 11 (ఆంధ్రజ్యోతి): రైతులు లేగదూడల పెంపకంలో తప్పనిసరిగా మెలకువలు పాటించాలని తద్వారా అవి ఆరోగ్యంగా పెరిగి యజమానికి ఆదాయ వనరుగా మారతాయని జిల్లా పశువైద్యాధికారి డాక్టర్ శారదమ్మ అన్నారు. నరసారెడ్డిపల్లెలో ఏపీ ఎల్‌డీఏ, కడప ఆర్థిక సౌజన్యంతో ఏర్పాటు చేసిన లేగదూడల పరిరక్షణలో జిల్లా పశువైద్యాధికారి లేగదూడల పెంపకంలో మెలకువలు, అవగాహన కల్పించారు. నేటి పరిస్థితుల్లో లేగదూడల పెంపకాన్ని శాస్త్రీయ పద్ధతుల ద్వారా పెంచాలన్నారు. వ్యాధినిరోధక టీకాలు ఎలాంటి సమయంలో ఇవ్వాలి, వ్యాధులు ఎలా గుర్తించాలి, గుర్తించకుంటే కలిగే నష్టాలు, వ్యాధులు రాకుండా చూసుకోవాల్సిన జాగ్రత్తలపై రైతులకు వివరించారు. కృత్రిమ గర్భధారణ ద్వారా మేలు జాతి రకం దూడలను ఉత్పత్తి చేసుకోవచ్చని తెలిపారు. ఈ విధానంపై ఆసక్తి చూపితే తక్కువ సమయంలోనే ఆరోగ్యవంతమైన లేగదూడలు పుట్టడం, వాటి ద్వారా ఆదాయం, అభివృద్ధిని సాధించవచ్చన్నారు. అనంతరం ప్రదర్శనకు వచ్చిన 42 లేగదూడలను పరిశీలించారు. వాటి యజమానులతో మాట్లాడారు. పశువైద్యాధికారుల సూచనలు పాటిస్తూ ఆరోగ్యంగా పెంచుకు న్న లేగదూడలు రైతు కుటుంబానికి మంచి ఆదాయ వనరని తెలిపారు. ప్రదర్శనలో పాల్గొన్న ముగ్గురు రైతులకు ప్రథమ, ద్వితీయ, తృతీయ బహుమతులు అందించారు. వీటితో పాటు క్యాల్షియం మందులు, ఏలికపాము నివారణ మందులు ఉచితంగా అందించారు. కార్యక్రమంలో కడప ఏడీ శ్రీనివాసులరెడ్డి, ఏపీఎల్‌డీఏ వైద్యులు డాక్టర్ శివరామిరెడ్డి, శరత్, గొర్రెల విభాగం వైద్యాధికారి నవీన్‌రెడ్డి, స్థానిక వైద్యులు ఉపేంద్ర, ఎర్రపేరురెడ్డితో పాటు పశువైద్య సిబ్బంది కల్యాణ్, రజిత, రవి, జీవన్, పలువురు రైతులు పాల్గొన్నారు.

ప్రైవేట్ ట్రావెల్స్‌పై రవాణా అధికారుల దాడులు

పర్మిట్‌లు లేకుండా తిప్పుతున్న బస్సులు సీజ్

రూ. 5.49 లక్షల జరిమానా



ఇడమడక టోల్ గేట్‌వద్ద బస్సులను తనిఖీ చేస్తున్న రవాణా అధికారులు

ప్రొద్దుటూరు, జనవరి 11 (ఆంధ్రజ్యోతి): సంక్రాంతి పండుగవేళ అక్రమంగా తిప్పుతున్న ప్రైవేట్ ట్రావెల్స్‌పై ప్రొద్దుటూరు రవాణా అదికారులు దాడులు నిర్వహించారు. శనివారం తెల్లవారుజామున చాగలమర్రి టోల్ గేట్ వద్ద హైదరాబాదు నుంచి ప్రొద్దుటూరకు వస్తున్న బస్సులను ఆర్‌టీఓ మురళీ ఆధ్వర్యంలో బ్రేక్ ఇన్‌స్పెక్టర్లు ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ తనిఖీల్లో రెండు బస్సులకు పర్మిట్ లేకున్నా అక్రమంగా తిప్పుతున్నట్లు గుర్తించారు. ఈరెండు బస్సులకు రూ.5.24 లక్షలు జరిమానా విధించారు. నిబంధనలకు విరుద్ధంగా బస్సులో ప్రయాణీకులనే కాకుండా అక్రమంగా గూడ్స్ రవాణా చేస్తున్న మరో రెండు బస్సులను సీజ్ చేశారు. వీటికి పదివేలు వంతున రూ.20 వేలు జరిమానా విధించారు. మరో బస్సుకు ఎఫ్‌సి లేనందున రూ.5వేలు జరిమాన విధించినట్లు ఆర్‌టీఓ తెలిపారు.

ఈ డీఈఓ మాకొద్దు

స్కూల్ ఎడ్యుకేషన్ కమిషనర్‌కు సంఘాల వినతి

కడప ఎడ్యుకేషన్, జనవరి 11 (ఆంధ్రజ్యోతి): ఉపాధ్యాయులను తీవ్రంగా దుర్భాషలాడుతూ, మానసిక క్షోభకు గురిచేస్తున్న డీఈఓ మీనాక్షి మాకొద్దని వెంటనే చర్యలు తీసుకోవాలని ఉపాధ్యాయ సంఘాల ఐక్యవేదిక ప్రతినిధులు కమిషనర్ విజయరామరాజును కోరారు. శనివారం మంగళగిరి కమిషనరేట్‌లో కమిషనర్ విజయరామరాజు, మంగళగిరి టీడీపీ ఆఫీస్ ఇన్‌చార్జి కొనకల్ల నారాయణకు ఉపాధ్యాయ సంఘాల ఐక్యవేదిక ప్రతినిధులు వినతిపత్రాలు సమర్పించారు. ఉపాధ్యాయ సంఘాల ప్రతినిధులు లెక్కల జమాల్‌రెడ్డి, రామాంజనేయులు, అంకాల కొండయ్య, రమణారెడ్డి, పి.వి.సుబ్బారెడ్డి మాట్లాడుతూ డీఈఓగా బాధ్యతలు తీసుకున్న ఆమె పలు పాఠశాలల సందర్శించినపుడు ప్రధానోపాధ్యాయులు, ఉపాధ్యాయులను మానసిక క్షోభకు గురిచేస్తోందన్నారు. ఆమె ఏదో ఒక వంక చూపుతూ తిట్ల దండకం మొదలు పెడుతుందని చెప్పారు. ఇటువంటి డీఈఓ జిల్లాకు ఉండడం దురదృష్టకరమని ఉండకూడదన్నారు. జిల్లాలోని 27 సంఘాల ఉపాధ్యాయ సంఘాల నేతలంతా ఈ డీఈఓ మాకు వద్దని ఉద్యమ కార్యాచరణ ప్రకటించారన్నారు.



కమిషనర్‌కు వినతిపత్రం సమర్పిస్తున్న ఉపాధ్యాయ సంఘాల ఐక్యవేదిక ప్రతినిధులు

‘పరిశ్రమల సహకారంతో ఉన్నత విద్యాభివృద్ధి’

కడప ఎడ్యుకేషన్, జనవరి 11 (ఆంధ్రజ్యోతి): ఉన్నత విద్యలో ప్రయోగాత్మక అభ్యసనం, ఒకే దేశం ఒకే పరీక్ష, నిరంతర సమగ్ర మూల్యాంకన పద్దతుల, వినూత్న పద్దతుల అమలుపై వైస్ చాన్సలర్ సమావేశంలో చర్చించినట్లు యోగివేమన విశ్వవిద్యాలయం ఉపకులపతి ఆచార్య కె.కృష్ణారెడ్డి వెల్లడించారు. తమిళనాడులోని వేలూర్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీలోని అన్నా ఆడిటోరియంలో అసోసియేషన్ ఆఫ్ ఇండియన్ యూనివర్సిటీస్ (ఏఐయూ) 10,11 తేదీల్లో పునరాలోచన అసెస్‌మెంట్ మూల్యాంకనంపై రెండు రోజుల సౌత్‌జోన్ వైస్ చాన్సెలర్ల సమావేవంలో వైవీయూ వీసీ ఉన్నత విద్యపై ప్రసగించారు. స్టార్టప్‌లు, పెట్టుబడిదారులు, ఇంక్యుబేటర్‌లతో సహకారాన్ని అన్వేషించడం ద్వారా ఆవిష్కరణలను పెంపొందించడంలో విశ్వవిద్యాలయం నిబద్ధతతో ఉందన్నారు. విద్యా సంస్థలు పరిశ్రమలతో అనుసంధానమై పని చేసే నైపుణ్యత గల విద్యార్థులు సమాజంలో వస్తారని ఆ దిశగా ప్రయత్నాలు జరగాలన్నారు. ఈ చర్చల్లో వైవీయూ ప్రొఫెసర్ కె.కృష్ణారెడ్డి, ఏపీ నుంచి ప్రొఫెసర్ పి.పాపారావు (ఎస్‌వీ తిరుపతి), ప్రొఫెసర్ ఎన్‌టీకే నాయక్ (రాయలసీమ యూనివర్సిటీ) చర్చల్లో పాల్గొని భారతదేశ ఉన్నత విద్యపై సమ్మిళిత వృద్ధికి విలువైన సూచనలను అందించారు.

సాయి ఏజెన్సీని రద్దు చేయాలి

మున్సిపల్ యూనియన్ జిల్లా గౌరవాధ్యక్షుడు మనోహర్

కడప నాగరాజుపేట, జనవరి 11 (ఆంధ్రజ్యోతి): జిల్లా వ్యాప్తంగా క్లాప్ వాహనాలు ప్రొద్దుటూరు, జమ్మలమడుగు, కడపలో నడుస్తున్నాయని, కార్మికులకు రూ.18వేలు ఇవ్వాల్సి ఉండగా దాదాపు రూ.10500 మాత్రమే ఇస్తున్న సాయి పావని ఏజెన్సీని రద్దు చేయాలని మున్సిపల్ యూనియన్ జిల్లా గౌరవాధ్యక్షుడు మనోహర్, సీఐటీయూ నగర అధ్యక్ష, కార్యదర్శులు వెంకటసుబ్బయ్య, చంద్రారెడ్డి డిమాండ్ చేశారు. విశాఖలో రూ.18వేలు ఇస్తున్నారన్నారు. కడపలో రూ.13వేలు అని చెప్పి రూ.10500 మించి ఇవ్వడం లేదన్నారు. రెడ్డి ఏజెన్సీ మీద, పావని ఏజెన్సీ మీద లేబర్ డిపార్ట్‌మెంట్‌లో చర్చలు నడుస్తున్నాయని గుర్తుచేశారు. అయినా సాయి పావని యాజమాన్యం స్పందించకపోవడం అన్యాయమని తెలిపారు. ఇప్పటికైనా తక్కువ వేతనాలు ఇస్తున్న సాయి పావని ఏజెన్సీని రద్దు చేసి కార్పొరేషన్, మున్సిపాలిటీలు నిర్వహించాలన్నారు. జీఓ 7 ప్రకారం రూ.24500 వేతనం ఇవ్వాలని డిమాండ్ చేశారు. ప్రజల ద్వారా వసూలు చేస్తున్న డబ్బు ఒక్కో వాహనానికి దాదాపు రూ.63000 ఇస్తున్నారని, డీజల్, డ్రైవర్ ఇతరుల పేరు మీద రూ.30 నుంచి రూ.40వేలు మాత్రం కూడా ఖర్చుపెట్టలేదన్నారు. పీఎఫ్, ఈఎస్ఐ సక్రమంగా కట్టలేదని ఆరోపించారు. వీటిపై విచారణ చేసి పావని ఏజెన్సీపై, రెడ్డి ఏజెన్సీపై చర్యలు తీసుకోవాలని ఒక సంయుక్త ప్రకటనలో డిమాండ్ చేశారు.

అడ్డంకుల నడుమ ఆరు లేన్లు

20 కి.మీ రోడ్డు పనులకు నాలుగున్నర కి.మీ అభ్యంతరాలు

● క్లియరెన్స్ అయ్యేనా...? ● పనులు పూర్తయ్యేదెప్పుడు



ఆరు లేన్ల రహదారికి జరుగుతున్న కారిడార్ నిర్మాణం

పోరుమామిళ్ల, జనవరి 11 (ఆంధ్రజ్యోతి): పట్టణాల నుంచి రాజధాని నగరాలకు వెళ్లాలన్నా, మెగా నగరాలకు వెళ్లాలన్నా ప్రయాణీకుల దూరాన్ని తగ్గిస్తూ ప్రయాణీకుల మెరుగైన సౌకర్యం కల్పించడమే కేంద్ర ప్రభుత్వం లక్ష్యం. ఇందులో భాగంగా విజయవాడ మీదుగా కడప, బెంగళూరుకు వెళ్లే గ్రీన్‌ఫీల్డ్ నిర్మాణం ఆరు లేన్ల రహదారికి పనులు 20 కిలో మీటర్ల మేర పనులు జరిగితే నాలుగున్నర కిలో మీటర్ల మేరకు అభ్యంతరాలు వ్యక్తం మవుతున్నాయి. ఆరులేన్ల రహదారికి నిధులు కేటాయించింది. వివరాల్లోకెళితే...

విజయవాడ నుంచి బెంగళూరు వెళ్లేవారికి. బెంగళూరు నుంచి విజయవాడ వెళ్లేవారికి తక్కువ దూరం పట్టేందుకు వీలుగా నిర్మాణాలకు శ్రీకారం చుట్టింది. మల్లేపల్లె నుంచి కవలకుంట్ల రెవెన్యూ పొలాల వరకు దాదాపు 20 కి.మీ పొడవునా ఆరు లేన్ల రహదారికి రూ.622 కోట్లు నిధులు కేటాయించింది. మల్లేపల్లె నుంచి చెన్నారెడ్డిపేట వరకు అర్త్ పనులు ప్రారంభమయ్యాయి. 20 బ్రిడ్జిలు అండర్‌ప్రాసెస్‌లో ఉన్నాయి. సిద్దవరం వద్ద దాదాపు 5 కి.మీ అర్త్ వర్క్ జరుగుతోంది. అటవీశాఖకు సంబంధించి ఇంకా కిలోమీటరు క్లియరెన్స్ కావాల్సి ఉండగా ఈ పనులు దక్కించుకున్న మెగా ఇంజనీరింగ్ కన్‌స్ట్రక్షన్స్ వారు అనుమతి కోసం ప్రభుత్వానికి నివేదిక కోరింది. మూడున్నర కిలోమీటరు రైతులకు సంబంధించి నష్టపరిహారం కొందరికి అందకపోవడం వల్ల ఆ పనులు కూడా కొద్దిగా జాప్యం జరిగే అవకాశాలున్నాయి. ప్రస్తుతం 15శాతం పనులు జరిగాయి. కొన్నిచోట్ల టన్నెల్ పనులు జరుగుతున్నాయి. దాదాపు ఆరులేన్ల రహదారికి సంబంధించి 8గ్రామాలకు 162 ఎకరాల పొలాలు రహదారికి అవసరం అవుతాయి. వీటి కోసం రహదారి నిర్మాణంలో భూములు కోల్పోయే వారి కోసం ప్రభుత్వం రూ.21 కోట్లు నిదులు మంజూరు చేసింది. ఇందులో దాదాపు 247 మంది రైతులకు రూ.13 కోట్ల వరకు పంపిణీ జరిగినట్లు సమాచారం. ఇంకా 68 ఎకరాలకు సంబంధించి 56 మంది రైతులకు పరిహారం అందాల్సి ఉంది. అయితే రెవెన్యూ అధికారులు పూర్తి స్థాయిలో రికార్డులు పరిశీలించి భూములు కోల్పోయిన వారందరికీ పరిహారం అందిస్తామని చెబుతున్నారు. ఇటీవల జేసీ కూడా భూములు పరిశీలించి పనులకు అభ్యంతరాలు తెలపవద్దని, అర్హులందరికీ నష్టపరిహారం దక్కేలా చేస్తామని హామీ ఇచ్చారు. ఇందుకు సంబంధించి గతంలో రెవెన్యూ అధికారులు రైతులతో సమావేశం ఏర్పాటు చేసి భూములు కోల్పోయే వారి విస్తీర్ణం, రికార్డులను అప్పజెబితే వారందరికీ పరిహారం అందిస్తామని చెబుతున్నారు. ఈ నేపథ్యంలో ఈ ఆరులేన్ల రహదారికి అడ్డంకులన్నీ పూర్తి చేసుకుని నిర్మాణం వేగవంతమైతే పూర్తయ్యే సమయానికి ఎంత సమయం పడుతుందోనని ఈ ప్రాంతీయులు ఎదురు చూస్తున్నారు. కొన్ని చోట్ల గ్రావెల్‌కు మైనింగ్ అధికారుల అనుమతులు కూడా అందాల్సి ఉందని తెలిసింది. ఈ అడ్డంకులన్నీ తొలగి పనులు ఎప్పుడు వేగవంతమవుతాయో, ఎప్పుడు పూర్తవుతాయోనని ప్రజలు ఎదురు చూస్తున్నారు. కొందరు రైతులు అయితే నష్టపరిహారం కోసం ఎదురు చూస్తున్నారు.



ఆరు లేన్ల రహదారికి నీళ్లు తడుపుతున్న దృశ్యం



రోలరుతో చదును చేస్తున్న దృశ్యం

రూ. కోటి స్థలంలో ఆగని అక్రమాలు

ఖద్దరు అండతో సాగుతున్న నిర్మాణాలు ● పట్టించుకోని నేషనల్ హైవే అథారిటీ అధికారులు

రైల్వేకోడూరు, జనవరి 11 (ఆంధ్రజ్యోతి): కబ్జా స్థలంలో అక్రమ కట్టడాలు సాగుతున్నాయి. ఖద్దరు అండతో నిర్మాణాలు జోరందుకున్నాయి. పోలీసుల హెచ్చరిక లు సైతం పట్టించుకోకుండా నిర్మాణాలు చేస్తున్నారు. నేషనల్ హైవే అథారిటీ స్థలం లో అక్రమ కట్టడాలు జరుగుతున్నా పట్టించుకోకుండా నిమ్మకు నీరెత్తినట్లు వ్యవహరిస్తున్నారు. వివరాల్లోకి వెళితే....

రైల్వేకోడూరు పట్టణం లక్ష్మీపార్యడైజ్ సినిమా హాలు వద్ద ప్రధానదారి పక్కనే ఉన్న నేషనల్ హైవే అథారిటీ స్థలాన్ని ఆక్రమించి భారీ ఎత్తున అక్రమ కట్టడాలు సా గుతున్నాయి. మొత్తం 20 అడుగుల స్థలాన్ని ఆక్రమించారని స్థానికులు చెబుతున్నారు. ప్రస్తుత ధర ప్రకారం ఆక్రమిత స్థలం రూ. కోటి విలువ చేస్తుందని అంచనా. ఖద్దరు బాబుల అండతో ఆక్రమణలు జోరుగా సాగుతు న్నాయి. రైల్వేకోడూరు మెయిన్ రోడ్డులో స్థలం చాలా విలువైన స్థలం కావడంతో ప్రధాన దారికి ఇరువైపులా ఉన్న భవనాల్లో అద్దె భారీ ఎత్తున ఉంటాయి. ఇతర ప్రాంతీయులు రైల్వే కోడూరులో స్థిరపడి కొంత స్థలాన్ని కొనుగోలు చేస్తుంటారు. స్థలానికి ముందు భాగంలో ఉన్న ప్రభుత్వ స్థలాలను ఆక్రమించుకుని భవ న నిర్మాణాలు చేస్తుంటారు. ఇది రైల్వేకోడూరులో పరిపాటిగా మారింది. ప్రభుత్వ స్థలం కని పిస్తే చాలు అట్లే వాలిపోయి ఆక్రమించి భవనాలు నిర్మాణాలు సాగిస్తారు. ఇది కేవలం ఖద్దరు బాబుల అండతోనే సాగుతోంది. ఎక్కడా లేని విధంగా రైల్వేకోడూరులో ఈ తంతు సాగుతోందని స్థానికులు చెబుతున్నారు. చికెన్ దుకాణానికే ఇంత పెద్దగా నిర్మాణం చేస్తున్నారంటే షాపింగ్‌కు అయితే ఇంకెంత పెద్ద భవనం కడతారా అని స్థానికులు ఆశ్చర్యం వ్యక్తం చేస్తున్నారు. రైల్వేకోడూరు ప్రధానదారిలో ఎక్కడ చూసినా ఆక్రమణలే కనిపిస్తున్నాయి. డాక్యుమెంట్‌లో ఎక్కడా నిర్మాణాలు సాగడం లేదు. డాక్యుమెంట్‌లో 60 అడు గుల పొడవు, 20 అడుగుల వెడల్పు ఉంటే పొడవులో 100 అడుగులు, వెడల్పులో 30 అడుగులు కలిపి అక్రమ నిర్మాణాలు చేస్తున్నారు. ఈ తతంగం తెలిసినా నేషన్ హైవే అథారిటీ అధికారులు పట్టించుకోకుండా ఉన్నారని ప్రజలు ఆరోపిస్తున్నారు. ఇప్పటికైనా ఆక్రమణలు జరిగిన ప్రాంతాలను పరిశీలించి, సర్వే చేయించి చర్యలు తీసుకోవాలని స్థానికు లు డిమాండ్ చేస్తున్నారు.



ప్రభుత్వ స్థలంలో సాగుతున్న పనులు

నేషనల్ అథారిటీ అధికారి ఏమంటున్నారంటే

లక్ష్మీప్యారడైజ్ సినిమా హాలు స్థలంలో ఆక్రమణలు జరుగుతున్నాయని తమ దృష్టికి వచ్చిందని జిల్లా నేషనల్ అథారిటీ అధికారి నారాయణ నాయక్ తెలిపారు. పోలీసులకు ఫిర్యాదు చేశామని, సర్వే చేయమని తహసీల్దార్‌ను కోరామన్నారు. ఆక్రమణలపై చర్యలు తీసుకుంటామని ఆయన వివరించారు.

లక్ష్మీనరసింహస్వామికి పంచలోహ కవచం

బద్వేలు రూరల్, జనవరి 11 (ఆంధ్రజ్యోతి): వల్లెలవారిపల్లెలో వెలసిన లక్ష్మీ నరసింహస్వామి వారికి పంచలోహ కవచం (తొడుగు)ను బహూకరించారు. శనివారం దివంగతులు నల్లం బాలక్రిష్ణ (ఆర్మీ) సతీమణి అర్చన రూ.1.30లక్షలు విలువైన కవచం వేదపండితుల ఆధ్వర్యంలో స్వామివారికి కవచ సంప్రోక్షణ నిర్వహించి అలంకరించారు. అనంతరం మధ్యాహ్నం అన్నదానం నిర్వహించారు. భక్తులు స్వామివారిని దర్శించుకున్నారు.



పంచలోహ కవచాన్ని సమర్పిస్తున్న దాతలు

అన్నదానానికి రూ.50వేలు విరాళం



నిత్యాన్నదాన పథకానికి విరాళం అందిస్తున్న దాతలు

చక్రాయపేట, జనవరి 11 (ఆంధ్రజ్యోతి): గండి క్షేత్రంలో నిర్వహించే శాశ్వత నిత్యాన్నదాన పథకానికి కడపకు చెందిన పవన్‌కల్యాణ్ తల్లిదండ్రులు కె.ఆనందబాబు, వనిత, కుటుంబ సభ్యులు రూ.50వేలు చెక్కు రూపంలో విరాళం అందించారు. వీరిక ప్రత్యేక దర్శనం చేయించి తీర్థప్రసాదాలు అందించారు. ఆలయ సహాయ కమిషనర్ కె.వెంకటసుబ్బయ్య, మాజీ పాలక మండలి చైర్మన్ కల్లూరు వెంకటస్వామి, ప్రధాన అర్చకులు కేసరి తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థులు ప్రతిభ కనపరచాలి

ప్రొద్దుటూరు టౌన్, జనవరి 11 (ఆంధ్రజ్యోతి): విద్యార్థులు చదువుతోపాటు కళల్లో ప్రతిభ కనపరచాలని ఎమ్మెల్సీ భూమిరెడ్డి రాంగోపాల్‌రెడ్డి, ఎమ్మెల్యే నంద్యాల వరదరాజులరెడ్డి అన్నారు. శ్రీకృష్ణ గీతాశ్రమంలో శనివారం నటరాజ కళాక్షేత్రం ఆధ్వర్యంలో రాయలసీమ సంగీత నృత్యోత్సవాల్లో ఎమ్మెల్సీ మాట్లాడుతూ మన సంస్కృతి, సంప్రదాయాల్లో కూచిపూడి, భరతనాట్యం, జానపద నృత్యాలు ఎంతో ప్రసిద్ధి పొందాయని, వాటిలో చిన్నారులను ప్రోత్సహించాలన్నారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ భారతీయ సంస్కృతి, సంప్రదాయాలు ప్రపంచ వ్యాప్తంగా గుర్తింపు పొందాయని, మన సంప్రదాయాలను పరిరక్షించుకోవాల్సిన అవసరం ఉందన్నారు. ప్రొద్దుటూరులో కళాక్షేత్రం ఏర్పాటుకు కృషి చేస్తానని తెలిపారు. నటరాజ కళాక్షేత్రం నాట్యగురువు మొహిద్దీన్‌ఖాన్ మాట్లాడుతూ విద్యార్థులను ప్రోత్సహించడానికే రాయలసీమస్థాయి సంగీత నృత్యోత్సవాలను నిర్వహిస్తున్నట్లు తెలిపారు. పలువురు కళాకారులకు రాయలసీమ సంగీతరత్న, కళారత్న అవార్డులను అందజేస్తామన్నారు. విద్యార్థులు ప్రదర్శించిన కూచిపూడి, జానపద నృత్యాలు ఆకట్టుకున్నాయి. రాయలసీమ, బళ్లారి ప్రాంతాల నుంచి 250 మంది కళాకారులు హాజరయ్యారు. కేంద్ర సంగీత నాటక అకాడమి, రాష్ట్రపతి అవార్డు గ్రహీత డాక్టర్ వేదాంతం రాధేశ్యామ్, కేంద్ర సాంస్కృతిక శాఖ సభ్యుడు డాక్టర్ వేదాంతం రామలింగశాస్త్రి, ఎస్వీ సంగీత నృత్య కళాశాల విశ్రాంత ప్రిన్సిపాల్ డాక్టర్ జమునారాణి, నాట్యకళాప్రపూర్ణ డాక్టర్ వెంకటసుబ్రమణ్యం, ఎస్వీ డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ హరినారాయణ పాల్గొన్నారు.



కూచిపూడి నృత్యం ప్రదర్శిస్తున్న చిన్నారులు

పీహెచ్‌సీలలో మందుల కొరత

● పట్టించుకోని ఆసుపత్రి అభివృద్ధి కమిటీలు
● మందుల కొనుగోలు, వసతులకు నిధులున్నా ఆసుపత్రులకు చేరని దుస్థితి
● అభివృద్ధి కమిటీల సమావేశాలు జరగక పోవడమే కారణమంటున్న వైనం

పెద్దతిప్పసముద్రం జనవరి 11 (ఆంధ్రజ్యోతి) : ప్రభుత్వాసుపత్రుల్లో మౌలిక వసతుల కల్పనతో పాటు మందుల కొరత వేధిస్తోంది. నిబంధనల మేరకు ఆయా ప్రభుత్వ ఆసుపత్రుల్లో అభివృద్ధి కమిటీలు ప్రతి మూడు నెలలకు ఒకసారి సమావేశాలు నిర్వహించి ఆసుపత్రుల్లో మందుల కొనుగోలు, కనీస సౌకర్యాల కోసం ఆసుపత్రి కమిటీ చైర్మన్లు ఆమోదం తెలపాల్సి ఉంటుంది. తంబళ్లపల్లె నియోజకవర్గంలోనే అతి పెద్ద మండలంగా పెద్దతిప్పసముద్రం విస్తరించింది. ఈ మండలంలో రెండు పీహెచ్‌సీలు ఉన్నాయి. ఒకటి స్థానిక పీటీఎంలోను మరొకటి కందుకూరు గ్రామంలో ఉన్నాయి. కందుకూరులో ఉన్న పీహెచ్‌సీ కిందకు 6 సచివాలయాలు, పెద్దతిప్పసముద్రం పీహెచ్‌సీ కిందకు 9 సచివాలయాలతో పాటుగా బి.కొత్తకోట మండలంలోని 15 సచివాలయాలను ఇందులో విలీనం చేశారు.



పెద్దతిప్పసముద్రం ఆరోగ్య కేంద్రం

ఊసేలేని కమిటీ సమావేశాలు

ఆయా ఆసుపత్రుల్లో ప్రతి మూడు నెలలకు ఒకసారి కమిటీ సమావేశాలు జరపాలి. అయితే గత వైసీపీ ప్రభుత్వ హయాంలో ఆసుపత్రి కమిటీ సమావేశాలు జరిపిన దాఖలాలే లేవు. దీంతో ఆసుపత్రుల్లో సరిపడా మందులు అందుబాటులో లేకపోవడంతో ఆసుపత్రులకు వచ్చే రోగులు ఇబ్బందులు పడుతున్నారు. దీనికి తోడు కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చి ఆరు నెలలు గడుస్తున్నా ఆసుపత్రుల్లో గత వైసీపీ ప్రభుత్వం నియమించిన కమిటీలే కొనసాగుతుండడంతో ఆసుపత్రుల్లో నెలకొన్న సమస్యలపై పట్టించుకోవడం లేదనే విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చి ఆరు నెలలు గడుస్తున్నా కనీసం ఒక్క సారైనా ఆసుపత్రి కమిటీ సమావేశాలు నిర్వహించి తీర్మానాలు చేయకపోవడంతో ప్రభుత్వాసుపత్రులకు సరిపడా నిధులు మంజూరు కావడం లేదనే విమర్శలున్నాయి. దీంతో ఆసుపత్రుల్లో సమస్యలు పరిష్కారం కావడం లేదని వైద్యాధికారులు చెబుతున్నారు. కాగా గత వైసీపీ హయాంలో ఆసుపత్రుల అభివృద్ధికి నిధులు మంజూరైనా కనీస సౌకర్యాలు కల్పించకుండా చేసిన పనులకే మళ్లీ మళ్లీ బిల్లులు పెట్టుకుని మమా అనిపించారు. ప్రశ్నిస్తే అప్పట్లో కేసులు పెడతారని భయపడి అందరూ మిన్నకుండిపో యారు.

కమిటీలు ఇలా....

ఆయా ఆసుపత్రి కమిటీల్లో చైర్మన్‌గా స్థానిక ఎంపీపీ, ఎంపీడీవో, మెడికల్ ఆఫీసర్, స్థానిక సర్పంచ్‌లు కమిటీ మెంబర్లుగా ఉంటారు. సమావేశాలను ప్రతి మూడు నెలలకు ఒక్కసారి నిర్వహించి తీర్మానం చేసుకుని మంజూరైన నిధులతో ఆసుపత్రుల్లో కనీస సౌకర్యాలు కల్పించాలి. అయితే ఉన్న కమిటీలు పట్టించుకోకపోవడంతో ఆయా ఆసుపత్రుల్లో సౌకర్యాలు కరువయ్యాయి. కూటమి ప్రభుత్వం ప్రభుత్వాసుపత్రులపై దృష్టి సారించాలని ప్రజలు కోరుతున్నారు.

ఉన్న నిధులతో చిన్న చిన్న పనులు చేశాం

పెద్దతిప్పసముద్రం ఆసుపత్రికి గతంలో రూ.5 లక్షలు నిధులు రాగా వాటితో చిన్న చిన్న మరమ్మతు పనులు చేపట్టినట్లు ఆస్పత్రి మెడికల్ ఆఫీసర్ పురుషోత్తం నాయక్ తెలిపారు. తమ పరిధిలో రోగులకుమెరుగైన వైద్యం అందించడమే ధ్యేయంగా పనిచేస్తున్నామని తెలిపారు.

వేర్వేరు ప్రమాదాల్లో నలుగురికి గాయాలు

మదనపల్లె అర్బన్, జనవరి 11(ఆంధ్రజ్యోతి): వేర్వేరు ప్రమాదాల్లో నలుగురు గాయపడ్డారు. ఆస్పత్రి అవుట్ పోస్టు పోలీసుల వివరాల మేరకు మదనపల్లె మండలం, బసినికొండకు చెందిన రామమూర్తి భార్య మంగమ్మ(60) తనతో పాటు లక్ష్మీదేవి(33) రోడ్డుపై నడుచుకొంటూ వెళుతుండగా వారిని ద్విచక్రవాహనంపై వస్తున్న మోహన్ ఢీ కొట్టారు. దీంతో గాయపడిన వారిని స్థానికులు మదనపల్లె జిల్లాప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. అలాగే సత్యసాయి జిల్లా ఎన్‌పీ కుంటకు చెందిన మౌలాలీ(38) అమ్మచెరువు మిట్టవద్ద కారు సైడ్‌కు రావడంతో ద్విచక్రవాహనం నుంచి కిందపడి గాయపడడంతో కాలు విరిగింది. స్థానికులు మదనపల్లె జిల్లా ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. ఇక్కడ డాక్టర్లు చికిత్స అనంతరం తిరుపతికి రెఫర్ చేశారు. బి కొత్తకోట మండలం, గుడిపల్లెకు చెందిన లక్ష్మీదేవి (45) ద్విచక్రవాహనంలో బి.కొత్తకోటకు వస్తుండగా కుక్క అడ్డురావడంతో కిందపడి గాయపడింది. బాధితురాలిని 108 వాహనంలో మదనపల్లె ఆస్పత్రికి తరలించారు.

మాజీ సర్పంచ్ మృతి


రఘునాథ్‌రెడ్డి భౌతికకాయానికి నివాళులర్పిస్తున్న నల్లారి కిశోర్‌కుమార్‌రెడ్డి

గుర్రంకొండ, జనవరి 11(ఆంధ్రజ్యోతి): గుర్రంకొండ మండలం నడిమికండ్రిగ మాజీ సర్పంచ్ రఘునాథ్‌రెడ్డి అనారోగ్యంతో మృతి చెందాడు. విషయం తెలుసుకున్న పీలేరు ఎమ్మెల్యే నల్లారి కిశోర్ కుమార్‌రెడ్డి పార్యంపల్లెకు వెళ్లి ఆయన భౌతికకాయానికి పూల మాల వేసి నివాళులర్పించి కుటుంబ సభ్యులకు సానుభూతిని తెలిపారు. కార్యక్రమంలో నాయకులు జగదీష్, ఎల్లుట్ల మురళీ, చలమారెడ్డి, సుధాకర్, కేవీ, రెడ్డిశేఖర్, మనోహర్‌రెడ్డి, హరి, మధు తదితరులు పాల్గొన్నారు.

కోడి పందేలు నిర్వహిస్తే చర్యలు

పెద్దమండ్యం, జనవరి 11(ఆంధ్రజ్యోతి) సంక్రాంతి పండగ సందర్భంగా కోడిపందేలు నిర్వహిస్తే కఠిన చర్యలు తప్పవని పెద్దమండ్యం ఎస్‌ఐ రమణ హెచ్చరించారు. పెద్దమండ్యంలో విలేఖర్లతో ఎస్‌ఐ మాట్లాడుతూ సంక్రాంతి పండగ పేరుతో కోడిపందేలు, జూదాలు నిర్వహిస్తే ఇబ్బందులు ఎదుర్కొంటారన్నారు. గ్రామాలలో అపరిచితులు సంచరిస్తే వెంటనే పోలీసుస్టేషన్ కు కానీ 100 నెంబర్ డయల్ చేయాలని తెలిపారు. సమాచారం అందించిన వారి పేరు గోప్యంగా ఉంచుతామన్నారు.

ఘనంగా ముందస్తు సంక్రాంతి సంబరాలు



మదనపల్లె టౌన్, జనవరి 11(ఆంధ్రజ్యోతి):మదనపల్లె పట్టణంలో శ్రీజ్ఞానాంబిక డిగ్రీ కళాశాలలో ముందస్తు సంక్రాంతి సంబరాలు వేడుకగా నిర్వహించారు. శనివారం కళాశాల ఆవరణంలో కరస్పాండెంట్ ఆర్.గురుప్రసాద్ ఆధ్వర్యంలో విద్యార్థినులు రంగవల్లులు తీర్చిదిద్దారు. పొంగళ్ల వండి విద్యార్థులకు పంచిపెట్టారు. భోగి మంటలు వేసి, మంటల చుట్టూ గొబ్బిపాటలు పాడుతూ నృత్యం చేశారు. కార్యక్రమంలో ప్రిన్సిపాల్ ఎస్.రమాదేవి, ఎన్‌ఎస్‌ఎస్ అధికారులు ఉదయ్, హిమశేఖర్, విద్యార్థులు పాల్గొన్నారు.

పీలేరులో: పీలేరులోని బలిజ సేవా సంఘం ఆధ్వ ర్యంలో శనివారం ముందస్తు సంక్రాంతి సంబరాలు ఘనంగా జరిగాయి. అందులో భాగంగా మహిళలకు ముగ్గుల పోటీలు, చిన్నారులకు మ్యూజికల్ చైర్స్, యువతకు కబడ్డీ పోటీలు ఏర్పాటు చేసి విజేతలకు బలిజ సంఘం నాయకులు నగదు బహుమతులు అందజేశారు. ఇండియన్ బీచ్ ట్రీ పాఠ శాలలో జరిగిన ఈ కార్యక్రమంలో సంఘ నాయకులు పోతంశెట్టి రమేశ్, పసుపులేటి లక్ష్మీకర, జ్ఞానంగారి హరీష్, రామచంద్ర, బండారు నాగేంద్ర ప్రసాద్, ఎ.వెంకటరమణ, మనోహర్, సురేశ్, అజయ్, మధు, పీవీఎస్ లక్ష్మీ, కృష్ణకుమారి, కళావతి, చరిత, లావణ్య తదితరులు పాల్గొన్నారు.

గరుడ వాహనంపై వేంకటేశ్వరుడి విహారం



పీలేరు, జనవరి 11(ఆంధ్రజ్యోతి): వైకుంఠ ఏకాదశి ఉత్సవాల్లో భాగంగా శనివారం పీలేరు కోటపల్లెలోని ఆండాళ్ సమేత వేంకటేశ్వర స్వామి తనకు ఇష్టమైన గరుడ వాహనంపై పురవీధుల్లో విహరించాడు. ఉభయ దేవేరులు తోడు రాగా గరుడ వాహనంపై ఆశీనుడైన వేంకటేశ్వరుడు చిద్విలాసం చిందిస్తూ విహరిస్తుండగా చెక్కభజనలు, పిల్లనగ్రోవులతో ఆయన ముందు భక్తులు సాంస్కృతిక కార్యక్రమాలు ప్రదర్శించారు. అంతకుమునుపు ద్వాదశి కావడంతో శనివారం కూడా ఉదయం నుంచి సాయంత్రం వరకు భక్తులకు ఉత్తర ద్వార ప్రవేశం కల్పించారు. ఆలయ ధర్మకర్త జీవీ శ్రీనాథరెడ్డి నేతృత్వంలో ఆలయ కమిటీ సభ్యులు భక్తుల కోసం ప్రత్యేక ఏర్పాట్లు చేశారు.

రామాలయంలో వైకుంఠ ఏకాదశి వేడుకలు


వైకుంఠ ద్వారం గుండా రాములవారిని దర్శించుకుంటున్న భక్తులు

వాల్మీకిపురం, జనవరి 11(ఆంధ్రజ్యోతి): వాల్మీకిపురం పట్టణంలోని పట్టాభిరామాలయంలో శనివారం టీటీడీ ఆధ్వర్యంలో వైకుంఠ ఏకాదశి వేడుకలను వైభవంగా నిర్వహించారు. ఉదయం సుప్రభాత సేవ, ఆలయంలోని మూలవర్లకు అభిషేకం, అర్చన తోమాల సేవల తో ప్రత్యేక పూజలు జరిగాయి. అనంతరం భోగోత్సవ మూర్తులైన సీతా రామలక్ష్మణులకు విశేష అలంకరణలు గావించి ఉదయం 5గంటల నుంచి రాత్రి 9గంటల వరకు వైకుంఠ ద్వారం గుండా భక్తులకు దర్శన సౌకర్యాలు చేశారు. ద్వాదశి రోజున వేడుకలు చేయడం ఆలయం భక్తులతో కిటకిట లాడింది. అనంతరం భక్తులకు తీర్థ ప్రసాదాలు పంపిణీ చేశారు. ఈకార్యక్రమాలలో ఆలయ అధికారులు కృష్ణమూర్తి, నాగరాజు, అర్చకులు కృష్ణప్రసాద్‌భట్టార్, భాషికాచార్యులు, ఆలయ సిబ్బంది, భక్తులు పాల్గొన్నారు.

జీవనోపాధికి పశుపోషణ చక్కని తోడ్పాటు


గోకులం షెడ్డును ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే షాజహాన్‌బాషా

రామసముద్రం, జనవరి 11(ఆంధ్రజ్యోతి): జీవనోపాధికి పశుపోషణ చక్కని తోడ్పాటునందిస్తుందని ఎమ్మెల్యే షాజహాన్‌బాషా పేర్కొన్నారు. మండలంలోని నారిగానిపల్లె గ్రామ పంచాయతీ, పూలకుంట్లపల్లెలో రైతు శ్రీనివాసులు నూతనంగా నిర్మించిన గోకులం షెడ్‌లను ఎమ్మెల్యే ప్రారంభించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం రైతు సంక్షేమానికి కట్టుబడి ఉన్నదని తెలియజేశారు. ప్రస్తుతం మండలంలో 50 గోకులం షెడ్లు మంజూరయ్యాయని రెండవ విడతగా మరో 50 గోకులం షెడ్ల మంజూరుకు ప్రతిపా దనలు పంపినట్లు ఆయన చెప్పారు. కార్యక్రమంలో మండల పార్టీ అధ్యక్షులు విజయకుమార్‌గౌడు, రూపేష్‌రెడ్డి, లోకనాథరాజు, మాలమహానాడు అధ్యక్షుడు కృష్ణప్ప, మోడల్ స్కూల్ చైర్మన్ బాలాజీ, వడ్డెర సంఘం అధ్యక్షులు రెడ్డెప్ప, కృష్ణప్ప, అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

గోకులాలు పాడి రైతులకు వరం

పీలేరు, జనవరి 11(ఆంధ్రజ్యోతి): మినీ గోకులాలు పాడి రైతులకు వ రంలాంటిదని పీలేరు సింగిల్ విండో మాజీ అధ్యక్షుడు యల్లెల రెడ్డప్ప రెడ్డి పేర్కొన్నారు. పీలేరు మండలం కాకులారంపల్లె పంచాయతీ తుమ్మల వారిపల్లె గ్రామంలో రూ.2.30 లక్షలతో నిర్మించిన గోకులాన్ని శనివారం ఆయ న ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఎమ్మెల్యే నల్లారి కిశోర్ కుమార్ రెడ్డి చొరవతో పీలేరు మండలానికి రూ.1.12 కోట్లతో 48 గోకు లం షెడ్లను చంద్రబాబు ప్రభుత్వం మంజూరు చేసిందన్నారు. ఇన్‌చార్జ్ ఏపీవో సుధాకర్ మాట్లాడుతూ పీలేరు మండలానికి మంజూరైన 48 గోకులాలలో 32 పూర్తయ్యాయని, మిగిలిన 16 నిర్మాణ దశలో ఉన్నాయన్నారు. వాటిని కూడా వీలైనంత త్వరగా పూర్తి చేస్తామన్నారు. మాజీ సర్పంచ్ సురేంద్రనాథరెడ్డి టీడీపీ నాయకులు బాబురెడ్డి, చిన్నరెడ్డప్పరెడ్డి, మల్లి పాల్గొన్నారు.

కలకడలో:పాడిపరిశ్రమకు కూటమి ప్రభుత్వం అధిక ప్రాధాన్యత కల్పిస్తుందని టీడీపీ నాయకులు అన్నారు. గంగాపురం పంచాయతీలో ఉపాధి నిధులు రూ.2.30 లక్షలతో రైతులు దామోదర్‌రెడ్డి, రాజన్నలు నిర్మించిన గోకులాలను అధికారులు, నాయకులు ప్రారంభించారు. కార్యక్రమంలో నాయకులు కోట రమణనాయుడు, శ్రీనివాసులరెడ్డి, ఎంపీడీవో అబ్దుల్ రహీం పాల్గొన్నారు.

వాల్మీకిపురంలో: గోకులం షెడ్ల నిర్మాణం పాడి రైతులకు ఎంతో ఉపయోగకరమని టీడీపీ వాల్మీకిపురం మండల పార్టీ అధ్యక్షుడు మల్లికార్జునరెడ్డి పేర్కొన్నారు. శనివారం మండలంలోని మూరేవాండ్లపల్లెలో గోకులం షెడ్లను ఎంపీడీవో మనోహర్‌రాజుతో కలిసి ఆయన ప్రారంభించారు. మండలంలో 30షెడ్లు మంజూరయ్యాయని, వాటిలో ఇప్పటి వరకు 4యూనిట్లు పూర్తి అయ్యాయన్నారు. మాజీ సర్పంచ్ సురేష్‌రెడ్డి, టీడీపీ నాయకులు, గ్రామస్థులు పాల్గొన్నారు.

నిమ్మనపల్లిలో: గోకులాల షెడ్ల నిర్మాణాలతో పాడి రైతు లబ్ధి పొందడంతో పాటు పాడి పశువులకు ఆసరాగా ఉంటుందని ఎమ్మెల్యే షాజహాన్‌బాషా పేర్కొన్నారు. శనివారం మండలంలోని బండ్లపై గ్రామ పంచాయతిలో నిర్మించిన గోకుల షెడ్‌ను ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మండలానికి 28గోకులాలు మంజూరు కాగా పాడి రైతులకు మంజూరు చేసినట్లు తెలిపారు. కార్యక్రమంలో నాయకులు ఆర్జే వెంకటేష్, రామకృష్ణ, రెడ్డెప్ప, సుజాత, మల్లికార్జున, రఫీ, లక్ష్మన్న తదితరులు పాల్గొన్నారు.

ప్రజాసమస్యల పరిష్కారానికే తొలి ప్రాధాన్యం

మదనపల్లె టౌన్, జనవరి 11(ఆంధ్రజ్యోతి): మదనపల్లె పట్టణంలో ప్రజాసమస్యల పరిష్కారానికే తొలి ప్రాధాన్యత ఇస్తున్నామని ఎమ్మెల్యే షాజహాన్‌బాషా పేర్కొన్నారు. శనివారం పట్టణంలో 10వ వార్డు సుబ్బారెడ్డి లేఅవుట్‌లో ఎమ్మెల్యే వార్డుబాట ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన ఇంటింటికీ వెళ్లి ప్రజలకు ఏవైనా సమస్యలు ఉన్నాయా అని అడుగుతూ, ప్రజల నుంచి వచ్చే సమస్యలను నమోదు చేసుకుంటున్నారు. దీంతో పాటు చిన్నచిన్న సమస్యలను అప్పటికప్పుడే మున్సిపల్ కమిషనర్ ప్రమీల దృష్టికి తీసుకెళ్లి పరిష్కార మార్గాలను చూపుతున్నారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ పట్టణంలోని 35 మున్సిపల్ వార్డుల్లో ప్రతి రోజూ పర్యటించి సమస్యలను తెలుసుకోవడంతో పాటు వాటికి పరిష్కార మార్గాలను చూపుతామన్నారు. కార్యక్రమంలో టీడీపీ నాయకులు పాల్గొన్నారు.

సంక్రాంతికి ఊర్లకు వెళ్లే ప్రయాణికుల పాట్లు



మదనపల్లె అర్బన్, జనవరి 11(ఆంధ్రజ్యోతి): సంక్రాంతి పండుగకు తమ సొంతూర్లకు వెళ్లడానికి శనివారం మదనపల్లె ఆర్టీసీ బస్టాండ్‌లో ఉదయం నుంచి ప్రయాణికులు తీవ్ర ఇక్కట్లు పడ్డారు. బస్సులు తక్కువగా ఉండడంతో వచ్చిన బస్సు వద్దకు ప్రయాణికులు ఉరుకులు పరుగులు తీయాల్సివచ్చింది. ఇతర రాష్ట్రాలు, సుదూర ప్రాంతాల్లో ఉద్యోగ, వ్యాపారాల రీత్యా స్థిరపడిన వారు సొంతూళ్లకు వెళ్లడానికి గంటల తరబడి మదనపల్లె ఆర్టీసీ బస్టాండ్‌లో వేచి ఉన్నారు. ఇందులో మూడేళ్ల చిన్నారి తప్పి పోవడాన్ని గమనించిన ఆర్టీసీ కండక్టర్ అక్కడే ఉన్న పోలీసుల సహకారంతో వారి తల్లిదండ్రవ వద్దకు చేర్చారు.

తిరుమల ఘటనపై వైసీపీవి శవరాజకీయాలు

ములకలచెరువు, జనవరి 11 (ఆంధ్రజ్యోతి): ఉత్తరాంధ్రకు ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు తెచ్చిన రూ.2లక్షల కోట్ల పెట్టుబడుల గురించి ప్రజల దృష్టి మళ్లించడానికే వైసీపీ తిరుమల ఘటనపై శవ రాజకీయాలు చేస్తోందని రాష్ట్ర బీసీ సెల్ అధికార ప్రతినిధి గుత్తికొండ త్యాగరాజు పేర్కొన్నారు. ములకలచెరువులో శనివారం ఆయన మాట్లాడుతూ ఘటన జరిగిన వెంటనే చంద్రబాబునాయుడు బాధితులను పరామర్శించి బాధ్యులపై చర్యలు తీసుకున్నారన్నారు. గత వైసీపీ ప్రభుత్వ హయాంలో కచ్చులూరు బోటు ప్రమాదంలో 46 మంది, గేట్లు మరమ్మత్తులు చేయకపోవడంతో అన్నమయ్య డ్యాం కొట్టుకుపోయి 40 మంది, కొవిడ్ సమయంలో తిరుపతి రూయా ఆస్పత్రిలో ఆక్సిన్ అందక చిన్నారులు ప్రాణాలు వదిలారన్నారు. జగన్‌రెడ్డి పాలనలో ఎన్నో వైఫల్యాలు చెంది ఇప్పుడు శవ రాజకీయాలు చేయడం దురదృష్టకరమన్నారు,

మిశ్రా కమిషన్ పర్యటనను విజయవంతం చేద్దాం

ములకలచెరువు, జనవరి 11 (ఆంధ్రజ్యోతి): ఎస్సీ వర్గీకరణ చట్టబద్దతకై వన్ మ్యాన్ కమిషన్ రాజీవ్ రంజాన్ మిశ్రా ఈ నెల 21న చిత్తూరు జిల్లా కేంద్రానికి వస్తున్న సందర్భంగా తంబళ్లపల్లె నియోజకవర్గం నుంచి మాదిగ, మాదిగ ఉపకులాల ప్రజలు తరలివచ్చి విజయవంతం చేయాలని ఎమ్మార్పీఎస్, ఎంఎస్‌పీ జాతీయ నాయకులు నరేంద్రబాబు మాదిగ, రాష్ట్ర అధికార ప్రతినిధి దుడ్డు రామకృష్ణ మాదిగ పిలుపు నిచ్చారు. ములకలచెరువులో శనివారం ఎమ్మార్పీఎస్, ఎంఎస్‌పీ, అనుబంధ సంఘాల ముఖ్య నాయకులతో జరిగిన సమావేశంలో వారు మాట్లాడుతూ చిత్తూరుకు వేలాదిగా తరలివచ్చి కమిషన్‌కు వినతి పత్రాలు అందజేయాలన్నారు. నియోజకవర్గ ఇన్‌చార్జి తిరుపాల్, అధ్యక్షుడు ప్రతాప్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

బి.కొత్తకోటలో చోరీల జోరు..

బి.కొత్తకోట, జనవరి 11(ఆంధ్రజ్యోతి): పట్టణంలో చోరీల జోరు ఎక్కువైంది. తాజాగా శనివారం పట్టణంలోని పాశంవీధిలో శ్యామలమ్మ అనే మహిళారైతుకు చెందిన రెండు ఆవులను దొంగలు తోలుకెళ్లారు. తాను ఇటీవల రూ.2లక్షలు పెట్టి వాటిని కొనుగోలు చేశానని బాధిత మహిళ శాంతమ్మ వాపోయింది. ఈ మేరకు బి.కొత్తకోట పోలీసులకు ఫిర్యాదు చేసింది. సమాచారం అందగానే సీఐ జీవన్‌గంగనాథ్‌బాబు సంఘటనా స్థలానికి వెళ్లి విచారించారు. కాగా ఇదే పట్టణంలోని కరెంటుకాలనీలో ఈనెల 9న ఎస్వీ ప్రసాద్ అనే వ్యక్తి నివాసంలో ఇంటితాళాలు పగులగొట్టి 12గ్రాముల రెండు జతలకమ్మలు, 25 గ్రాముల నల్లపూసలచైనుతో పాటు రూ.10 వేల నగదు దొంగలు అపహరించారు. దీనిపై బాధితుడు పోలీసులకు ఫిర్యాదు చేశాడు. పోలీసులు దర్యాప్తు ముమ్మరం చేసి చోరీలను నియంత్రిం,చాలని ప్రజలు కోరుతున్నారు.

వైభవంగా శనేశ్వరుడికి మహా తైలాభిషేకం

వాల్మీకిపురం, జనవరి 11(ఆంధ్రజ్యోతి): వాల్మీకిపురం పట్టణ పడమర పొలిమేరల్లోని ధర్మపథం సమూహాలయంలో శనివారం షిరిడీ సాయి సాలిగ్రామ తిరునారాయణ ధార్మిక సేవా ట్రస్టు ఆధ్వర్యంలో శనేశ్వరుడికి మహాతైలాభిషేకం వైభవంగా నిర్వహించారు. ఆలయంలో వెలసిన శనేశ్వరస్వామికి అంతకు ముందు ఉదయం ప్రత్యేక అలంకరణలతో విశేష భక్తజనం నడుమ పూజలు జరిగాయి. ఈసందర్భంగా వేడుకల్లో పాల్గొన్న భక్తులకు తీర్థ ప్రసాదాల పంపిణీ, అన్నదాన కార్యక్రమాలు చేపట్టారు. ఈకార్యక్రమాలలో ట్రస్టు వ్యవస్థాపక అధ్యక్షుడు సాలిగ్రామ శ్రీనివాసాచార్యులు, ఆలయ కమిటీ సభ్యులు, భక్తులు పాల్గొన్నారు.

వడ్డెర్ల సంక్షేమమే సీఎం చంద్రబాబు ధ్యేయం

● నియోజకవర్గ పరిశీలకుడు మల్లికార్జుననాయుడు


వడ్డే ఓబన్న చిత్రపటానికి నివాళులు అర్పిస్తున్న నాయకులు

కురబలకోట/బి.కొత్తకోట, జనవరి 11 (ఆంధ్రజ్యోతి): వడ్డెర్ల సంక్షేమ మే ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు ధ్యేయమని నియోజకవర్గ పరిశీలకుడు సీడ్ మల్లికార్జునాయుడు పేర్కొన్నారు. శనివారం మండలంలోని అంగళ్ళు, విశ్వం కళాశాల వద్ద స్వాతంత్ర్య సమరయోధుడు వడ్డెర ఓబన్న 218వ జయంతి వేడుకలను పురస్కరించుకుని ఆయన చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ వడ్డెర్ల కోసం ప్రత్యేక కార్పొరేషన్‌లను ఏర్పాటు చేశారన్నారు. కార్యక్రమంలో వడ్డెర సంఘనాయకులు పి.సూరి, వెంకట్రమణ, తులసీ, బాలకృష్ణ, వెంకటరమణారెడ్డి, భాస్కర్, దామోదర్, మోహన్ పాల్గొన్నారు. బి.కొత్తకోట జ్యోతిసర్కిల్‌లో వడ్డెర సాధికారసంఘం ఆధ్వర్యంలో తాకాటంవారిపల్లెలో బీజేపీ మండలాధ్యక్షుడు డేరింగుల రామదాసు ఓబన్న నిలువెత్తు చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. భారీ కేక్‌ను కట్ చేసి పంచుకున్నారు. కార్యక్రమంలో వడ్డెరసాధికారసమితి నియోజకవర్గ అధ్యక్షుడు నాగమల్లప్ప, మండల అధ్యక్షుడు తమ్మిశెట్టి పద్మనాభం, కాసునాగరాజు, మస్తాన్, చంద్రశేఖర్, చౌడప్ప, గోవిందు తదితరులు పాల్గొన్నారు.

ములకలచెరువులో: ములకలచెరువులో శనివారం వడ్డె ఓబన్న 218 వ జయంతి వేడుకలు ఘనంగా నిర్వహించారు. స్థానిక బస్టాండు సర్కిల్‌లో ఓబన్న చిత్ర పటానికి పూజలు నిర్వహించి నివాళులు అర్పించారు. అలాగే భారీ కేక్‌ను కట్ చేసి ప్రజలకు పంచి పెట్టారు. కార్యక్రమంలో వడ్డెర సాధికార కమిటీ నియోజకవర్గ అధ్యక్షుడు కొమ్మిరి నాగమల్లప్ప, నాయకులు కోనంగి శ్రీనివాసులు, డేరంగుల ఆంజనేయులు తదితరులు పాల్గొన్నారు.


ర్యాలీ నిర్వహిస్తున్న వడ్డెర సంఘం నాయకులు

మదనపల్లె అర్బన్‌లో:స్వాతంత్ర్య సమరంలో వీరోచితంగా పోరాడిన వడ్డే ఓబన్న జయంతిని మదనపల్లెలో శనివారం ఘనంగా నిర్వహించారు. అధిక సంఖ్యలో వడ్డెర సంఘం నాయకులు పాల్గొని పట్టణంలో భారీ ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా బీజేపీ నాయకుడు బండి ఆనంద్ మాట్లాడుతూ ఓబన్న జయంతిని రాష్ట్ర ప్రభుత్వం అధికారికంగా నిర్వహించడం సంతోషంగా ఉందన్నారు. కార్యక్ర మంలో వడ్డెర సంఘం నాయకులు రెవన్న, రెడ్డెప్ప, మల్లయ్య, పద్మనాభ, శ్రీనివాసులు, రమేష్, నాగభూషణ్, మెహన్, శంకర, రామకృష్ణ, ఆంజనేయులు పాల్గొన్నారు.

పీలేరులో: వడ్డే ఓబన్న జయంతిని పీలేరులో శనివారం తెలుగుదేశం పార్టీ, వడ్డెర సంఘ నాయకురాలు ఓర్సు రమాదేవి ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. పీలేరు మార్కెట్ కమిటీ ఎదుట ఆయన భారీ చిత్రపటాన్ని ఆవిష్కరించి పూలమాలు వేసి ఘనంగా నివాళులర్పించారు. ఈ సందర్భంగా తెలుగుదేశం పార్టీ రాజంపేట పార్లమెంటు అధికార ప్రతినిధి కోటపల్లె బాబు రెడ్డి మాట్లాడుతూ వడ్డే ఓబన్న జయంతిని ప్రభుత్వమే అధికారికంగా నిర్వహించడం బీసీల పట్ల చంద్రబాబుకు ఉన్న ప్రేమకు నిదర్శనమన్నారు. అనంతరం కేక్ కట్ చేసి అందరికీ పంచి పెట్టారు. అంతకుమునుపు మహాత్మా జ్యోతిరావు పూలే విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో టీడీపీ నాయకులు పోలిశెట్టి సురేంద్ర, స్పోర్ట్స్ మల్లి, బీసీ అధ్యక్షుడు అప్పస్వామి, బండి సురేం ద్ర, చిన్నప్ప, చంద్రయ్య, రమాదేవి, చంద్రా స్వామి, భాస్కర, సహదేవ, రెడ్డప్ప, చంద్రమ్మ, తదితరులు పాల్గొన్నారు.

తంబళ్లపల్లెలో: తొలి తరం స్వాతంత్ర్య సమరయోధుడు వడ్డే ఓబన్న జయంతి వేడుకలను శనివారం తంబళ్లపల్లెలో వడ్డెర సంఘం ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా వడ్డె ఓబన్న చిత్ర పటం ఏర్పాటు చేసి పూల మాలలు వేసి పూజలు నిర్వహించి నివాళులర్పించారు. కార్యక్రమంలో పెద్దేరు ప్రాజెక్టు చైర్మెన్ కొటాల శివకుమార్, మాజీ సర్పంచ్ లక్ష్మీపతి, మండల సమాఖ్య అధ్యక్షురాలు రామలక్ష్మీ, సంఘం నాయకులు రమేష్‌బాబు, రేపన మల్లికార్జున, శివకేశవులు, జనార్ధన, బుజ్జన్న, శ్రీనివాసులు, వెంకట్రమణ, నాగరాజు, సుబ్బరాజు, సోమశేఖర్, రామ్మూర్తి తదితరులు పాల్గొన్నారు.

పెద్దతిప్పసముద్రంలో: స్వాతంత్ర్య సమరయోధుడు వడ్డెర ఓబన్న 218వ జయంతి వేడుకలను స్థానిక పీటీఎంలో ఘనంగా నిర్వహించారు. శనివారం ఉదయం స్థానిక బస్టాండులో వడ్డెర ఓబన్న చిత్రపటానికి వడ్డెర సంక్షేమ సంఘం నాయకులు, స్థానిక ప్రజాప్రతినిధులు పూల మాలలు వేసి ఘనంగా నివాళులు అర్పించారు. కార్యక్రమంలో జిల్లా వడ్డెర సంఘం అధ్యక్షుడు డేరంగుల నారాయణ, మండల ఎంపీపీ మహమూద్, ఎంపీటీసీ కార్యం చంద్రశేఖర్, తమ్మిశెట్టి పద్మనాభం, చౌడప్ప,పెన్నయ్య, పెయింటర్ నాగరాజు, నారాయణ, చిన్నరెడ్డెప్ప, మునెప్ప, ఓబులేసు, మంజునాథ్, సతీష్, బూర్లపల్లె సర్పంచ్ సుబ్బిరెడ్డిలు పాల్గొన్నారు.

'అవినీతి సర్పంచులను అరెస్టు చేయాలి'

పీలేరు, జనవరి 11(ఆంధ్రజ్యోతి): అవి నీతి ఆరోపణలు ఎదుర్కొంటున్న పీలేరు ప్రస్తుత సర్పంచ్, గతంలో ఇన్‌ఛార్జ్ సర్పంచ్‌గా పనిచేసిన వారిని వెంటనే అరెస్టు చేయాలని సీపీఐ పీలేరు నియో జకవర్గ సీపీఐ కార్యదర్శి టీఎల్ వెంకటేశ్ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. పీలేరులో శనివారం ఆయన విలేఖరులతో మాట్లాడుతూ జిల్లా ఉన్నతాధికారులు నియమించిన కమిటీ విచారణలో పీలేరు గ్రామ పంచాయతీలో దాదాపు రూ.1.5 కోట్ల మేర అవినీతి జరిగిందని ముగ్గురు అధికారులను సస్పెండ్ చేయడమే కాకుండా సర్పంచ్ చెక్ పవర్ రద్దు చేశారన్నారు. స్థానిక ఏఎంసీ ఆవరణలో జరిగిన ఈ సమావేశంలో రైతు సంఘం నాయకులు భాస్కర రెడ్డి, పరదేశి రెడ్డి, ఏఐఎస్ఎఫ్ జిల్లా ఉపాధ్యక్షులు వినోద్ నాయుడు, గొర్రెలు, మేకలు పెంపకందారుల సంఘం ఉపాధ్యక్షులు రమేశ్, చెంగన్న, సౌజన్య పాల్గొన్నారు.

కుల దహనం సభను జయప్రదం చేయండి

● బాస్ వ్యవస్థాపకుడు పీటీఎం శివప్రసాద్


సమావేశంలో మాట్లాడుతున్న బాస్ వ్యవస్థాపకుడు పీటీఎం శివప్రసాద్

మదనపల్లె, జనవరి 11 (ఆంధ్రజ్యోతి): భారతీయ అంబేద్కర్ సేన 13వ వార్షికోత్సవం సందర్భంగా ఆదివాం మదనపల్లెలో కుల దహనం పేరుతో జరుగుతున్న కుల నిర్మూలనా చైతన్య సభకు బాస్ నాయకులు, కార్యకర్తలతో పాటు కుల నిర్మూలన వాదులు తరలివచ్చి జయప్రదం చేయాలని ఆ సంస్థ వ్యవస్థాపకుడు పీటీఎం శివప్రసాద్ పిలుపునిచ్చారు. మదనపల్లెలో శనివారం ఆయన మాట్లాడుతూ దేశాన్ని పట్టి పీడిస్తున్న అతి పెద్ద జబ్బు కుల వ్యవస్థని, అనేక మంది సంఘ సంస్కర్తలు కుల నిర్మూలన కోసం ఉద్యమించారన్నారు. కుల దహనం పేరుతో బాస్ చేట్టిన కుల నిర్మూలన చైతన్య కార్యక్రమం చేపట్టిందన్నారు. ఈ సభకు వీసీకే పార్టీ సౌత్ ఇండియా కో ఆర్డినేటర్ బాల సింగం, కర్ణాటక నుంచి గొల్లహళ్ళి శివప్రసాద్, దళిత సంఘర్షణ సమితి రాష్ట్ర అధ్యక్షుడు వెంకటేష్, తెలంగాణ వీసీకే పార్టీ రాష్ట్ర అధ్యక్షుడు డాక్టర్ జిలుకర శ్రీనివాస్, విజయవాడ నుంచి సామాజిక విశ్లేషకుడు గుర్రం సుబ్బారావు, కర్నూల్ నుంచి బహుజన సమాఖ్య రాష్ట్ర అధ్యక్షుడు కొమ్ముపాలెం శ్రీనివాస్, అమరావతి నుంచి స్టేట్ బ్యాంక్ ఆఫ్ ఇండియా ఎస్సీ, ఎస్టీ ఎంప్లాయీస్ అసోషియేషన్ రాష్ట్ర అధ్యక్షుడు మేడికొండ సునీల్, యువ పారిశ్రామికవేత్త మండెం శ్రీనివాస్, వి.కోట నుంచి బాస్ స్టేట్ కన్వీనర్ ఉలగనాధన్ గణపతి తదితరులు అతిధులుగా హాజరుతారన్నారు.

టీడీపీ కోటి సభ్యత్వానికి కృషి చేయాలి


టీడీపీ సభ్యత్వ నమోదు చేయిస్తున్న క్రిస్టియన్ నాయకుడు జాన్‌బాబు

మదనపల్లె టౌన్, జనవరి 11(ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో టీడీపీ సభ్యత్వ నమోదు కోటి సంఖ్యకు చేరువ కావడానికి ప్రతి ఒక్క టీడీపీ కార్యకర్త కృషి చేయాలని టీడీపీ క్రిస్టియన్ సెల్ నాయకుడు జాన్‌బాబు పిలుపునిచ్చారు. శనివారం మండలంలోని కొండామర్రిపల్లెలో టీడీపీ సభ్యత్వ నమోదు కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా జాన్‌బాబు మాట్లాడుతూ మదనపల్లె నియోజకవర్గంలో ఎమ్మెల్యే షాజహాన్‌బాషా ఆధ్వర్యంలో టీడీపీ సభ్యత్వ నమోదు వేగంగా జరుగుతోందని, గ్రామాల్లో మరింత సభ్యత్వ నమోదు చేయడానికి శ్రీకారం చుట్టామన్నారు. టీడీపీ నాయకుడు తిమ్మరాయప్ప, పాల్గొన్నారు.

18న ములకలచెరువులో ఏఐటీయూసీ మహాసభ

ములకలచెరువు, జనవరి 11 (ఆంధ్రజ్యోతి):ములకలచెరువులోని కదిరి రోడ్డులో ఉన్న షాదీమహల్‌లో ఈ నెల 18న జరిగే ఏఐటీయూసీ తంబళ్లపల్లె నియోజకవర్గ మహాసభలను విజయవంతం చేయాలని ఏఐటీయూసీ అనుబంధ సంఘ జిల్లా ప్రధాన కార్యదర్శి సలీంబాషా పిలుపు నిచ్చారు. ములకలచెరువులో శనివారం భవన నిర్మాణ కార్మికులతో జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ మహాసభకు నియోజకవర్గంలోని కార్మికులు హాజరు కావాలన్నారు. నాయకులు మహబూబ్‌బాషా, నారాయణస్వామి, రెడ్డిమౌళాలి, మనోహర్, శివశంకర్, రమేష్ పాల్గొన్నారు.